





అధినేతతో ఎమ్మెల్యేలు

మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొన్న గుంటూరు, పల్నాడు,బాపట్ల జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు లోకేశ్, మనోహర్, అనగాని సత్యప్రసాద్

సోలార్.. బేజార్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పీఎం సూర్య ఘర్ స్కీము ద్వారా ఒకరు సోలార్ ప్లాంటు పెట్టించుకున్నారు. మూడు మెగావాట్ల ప్లాంటుకు రూ.78వేల సబ్సిడీ వస్తుండడంతో రూ.2లక్షలు బ్యాంకు లోను తీసుకుని మరీ ప్లాంటు పెట్టించుకున్నాడు. స్కీం ప్రకారం ప్లాంటు పూర్తైన 30 రోజుల్లో సబ్సిడీ నగదు అకౌంట్లో జమవ్వాలి. కానీ సదరు వినియోగదారుడికి మూడు నెలలైనా సబ్సిడీ రాలేదు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. అనేకమంది సబ్సిడీ డబ్బులు రాక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

● సోలార్ ప్లాంటు పెట్టించుకున్న తరువాత గతం కంటే ఎక్కువ కరెంటు బిల్లు రావడంతో మరొకరు షాక్ కు గురయ్యారు. సోలార్ ప్లాంటు పెట్టక ముందు నెల సరి కరెంటు బిల్లు సగటున రూ.700 వచ్చేది. రూ.2 లక్షలు పెట్టి పీఎం సూర్యఘర్ కింద సోలార్ ప్లాంటు పెట్టుకున్నారు. ప్రతి నెలా 400 యూని ట్లు కరెంటు తయారవడంతో 200 యూనిట్లు వాడుకు ని, 200 యూనిట్లు డిస్కమ్‌కు ఎగుమతి చేస్తున్నారు. అయినా సరే కరెంటు బిల్లు మాత్రం కట్టాల్సివ స్తోంది. ఒక నెల రూ.200 కరెంటు బిల్లు రాగా, రెండో నెల ఏకంగా రూ.731 బిల్లు వచ్చింది. దీంతో షాక్‌కు గురవడం వినియోగదారుడి వంతైంది.

- క్షేత్రస్థాయిలో విఫలమవుతున్న పీఎం సూర్యఘర్ పథకం
- సబ్సిడీలు రాక నానా అగచాట్లు పడుతున్న వినియోగదారులు
- కేంద్రం భారీ సబ్సిడీ ప్రకటించడంతో సామాన్యుల్లో ఆసక్తి
- అప్పు చేసి మరీ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్న వైనం
- సబ్సిడీ రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితి

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఆచరణలో అప్రతిష్ఠపాలవుతోంది. కేంద్రప్రభుత్వం భారీ గా సబ్సిడీ ప్రకటించడంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు అనేకమంది సబ్సిడీ రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చెప్పిన మాట నమ్మి తాము మోస పోయామంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనికితోడు మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు ప్రతినెలా కరెంటుబిల్లు కూడా చెల్లించాల్సి రావ డంతో అగ్గిమీద గుగ్గిల మైపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం తమను ఘోరంగా వంచించిందని ఆగ్రహం చెందుతున్నారు.


● **వేల సంఖ్యలో సోలార్ ప్లాంట్లు**

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక కి లోవాట్ ప్లాంటుకు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకైతే రూ.60వేలు, మూడు కిలోవాట్లకైతే రూ.78వేలు చొప్పు న భారీ స బ్సిడీలు ప్రకటించింది. కోటి ఇళ్లపై ప్లాంట్లు ఏర్పాటు చేయా లని లక్ష్యంగా పెట్టుకుని భారీగా ప్రచారం చేసిం ది. దీంతో చాలా మంది సోలార్ ప్లాంట్లు ఏర్పా టు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అందు తున్న లెక్కల ప్రకారం జూన్ ఐదో తేదీ నాటికి గుంటూరు జిల్లాలో 917 మంది, బాపట్ల జిల్లాలో 466 మంది, పల్నాడు జిల్లాలో 394మంది ఈ స్కీము కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకు న్నారు. కాగా వీరిలో చాలా మందికి ఈరోజు వరకూ సబ్సిడీ మాత్రం దక్కలేదు.

● **అప్పు చేసి తెచ్చుకున్న తిప్పలు**

గత ప్రభుత్వం 8 సార్లు కరెంటు బిల్లులు పెంచి మోత మోగిస్తుండడంతో సోలార్ పెట్టుకుంటే కరెంటు బిల్లు చెల్లించే బాధ లేదన్న ఆశ, సబ్సిడీ భారీ మొత్తంలో వుండడంతో వేల సంఖ్యలో సామాన్యులు సోలార్ ప్లాంట్ల వైపు మొగ్గు చూపారు. కొద్దో గొప్ప అవకాశం వున్న ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. సగటున ఒక్కొకరు రూ. 2 లక్షలు ఖర్చు చేసి ప్లాంటు పెట్టుకున్నారు. బ్యాంకుల నుంచి రూ.లక్షా 80వేలు లోను తీసుకు న్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే లక్ష రూపాయల లోనే కాబట్టి చెల్లించు కోవచ్చని భావించారు. కానీ వాస్తవ పరిస్థితి చాలా దారుణంగా వుంది. ప్లాంటు పూర్తై సబ్సిడీకి దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సబ్సిడీ ఇస్తానన్న కేంద్రం 100 రోజులు అవుతున్నా సబ్సిడీ ఇవ్వలేదు.

300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రమోట్ చేస్తోంది. కానీ వాస్తవంలో పరిస్థితులు వేరుగా వుంది. రూ. 2 లక్షలు పెట్టి ప్లాంటు పెట్టించుకున్నా కరెంటు బిల్లుల వాత మాత్రం వినియోగదారులకు తప్పడం లేదు. సోలార్ ప్లాంటు ద్వారా కరెంటు తయారు చేసుకుని, అదనపు కరెంటు డిస్కమ్‌కు ఎగుమతి చేసినా ప్రతి నెలా కరెంటు బిల్లు రావడంతో లబ్ధిదారులు షాక్‌కు గురవుతున్నారు. ప్రతి నెలా రూ. 200 నుంచి 300 వరకూ బిల్లులు వస్తున్నాయి. ఇంత ఖర్చు చేసినా గత వైసీపీ ప్రభుత్వం వేసిన అదనపు చార్జీల మోత మాత్రం తప్పలేదు. స్థిర చార్జీలు, కస్టమర్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రెండు, మూడు వందలు బిల్లులు వస్తుంటే వినియోగదారులు మొల్లు మంటు న్నారు. చాలా చోట్ల అధికారుల నిర్వాకంతో గతంలో కంటే కరెంటు బిల్లులు అదనంగా రావ డంతో హతాసుల వుతున్నారు. దీనిపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక అల్లాడిపోతున్నారు.



మూణ్ణాళ్లకే.. మూలకు..

- నీరుగారిపోతున్న శుద్ధజలం పంపిణీ
- కళాశాలల్లో నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్లు
- రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినా శిథిలావస్థకు..
- మరమ్మతులపై చేతులెత్తేసిన ఏజన్సీ నిర్వాహకులు



గుంటూరులోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 18: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం పంపిణీ మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. రూ.లక్షల వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు నిర్వహణా లోపం, మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆర్భాటంగా ఏర్పా టు చేసిన వాటర్ ప్లాంట్లు శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 22 వరకు ఉండగా గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఒక్కో కళాశాలకు రెండు చొప్పున వాటర్ ప్లాంట్లను మంజూరు చేసింది. ఒక్కో ప్లాంట్ కోసం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు వెచ్చించింది. ప్లాంట్స్‌ను కొనుగోలు చేసి వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ, మరమ్మతుల కోసం కొన్ని ఏజన్సీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అయితే ఏజన్సీ నిర్వాహకులు ఉమ్మడి జిల్లా పరిధిలోని 22 జూనియర్ కళాశాలల్లో వాటర్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేశారు. రోజుకు సగటున 3 వేల నుంచి 5 వేల లీటర్ల సామర్థ్యంతో శుద్ధజలం విద్యార్థులకు అందేలా వీటిని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో అవి పనిచేయడం లేదు. మరికొన్ని దగ్గర్ల మరమ్మతులతో మూలకు చేరాయి. దాదాపు పది కళాశాలల్లో వాట ర్ ప్లాంట్లు సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. కొన్నిచోట్ల ఫిల్టర్స్‌ను సకాలంలో మార్చడం లేదు. దీంతో తాగడానికి అనుకూలంగా నీరు లేదని విద్యార్థులు వాపోతున్నారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాలలో నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేయ గా వృత్తి విద్యా కళాశాలలో ఒక ప్లాంట్ ఇప్పటికే మూలన పడింది. జూనియర్ కళాశాలలో ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. నిర్వహణ ఏజన్సీలకు ప్రిన్సిపాల్స్ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. మరమ్మతుల కోసం ఎన్నిసార్లు ఏజన్సీలను సంప్రదించినా ఇదుగో అదిగో అంటూ కాలం గడుపుతున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని కొందరు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఏజెన్సీలను అదుపులో పెట్టేదెవరు..

వాటర్ ప్లాంట్ల నిర్వహణ ఏజెన్సీల తీరు ఇష్టారాజ్యంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి చేసుకున్న ఒప్పందం ప్రకారం వారు నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం లేదు. వాటర్ ప్లాంట్‌కు చెల్లించే మొత్తంలోనే నిర్వహణకు ప్రభుత్వం నగదు చెల్లించినట్లు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. అయితే ఏజెన్సీ మాత్రం నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. సిబ్బంది లేమి, లోపించిన సాంకేతిక నైపుణ్యం, స్పేర్‌పార్ట్స్ కొరత తదితర కారణాలతో నెలల తరబడి ప్లాంట్స్ మరమ్మతులకు నోచుకోవ డం లేదు. ఫలితంగా విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యం నీరుగారుతోందని ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాయం సిద్ధం

- వరద నష్టం గణన.. లెక్కలు పూర్తి
- వివరాలతో గ్రామాల్లో సోషల్ ఆడిట్
- రేపు ప్రభుత్వానికి తుది జాబితా అందజేత

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరదలు మిగిల్చిన విషాదం లంక గ్రామాల ప్రజలను వెంటాడుతూనే ఉంది. బాధితులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం నష్టం గణన కోసం పెద్ద ఎత్తున సిబ్బందిని రంగంలోకి దింపింది. వ్యవసాయ సిబ్బంది పంటలకు జరిగిన నష్టం లెక్కలను క్షేత్రస్థాయిలో లెక్కించగా, రెవెన్యూ యంత్రాంగం ఇళ్లకు, సామాన్లకు వాటిల్లిన నష్టంపై సర్వే నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ పంటలకు వాటిల్లిన నష్టం వివరాలను ఈ క్రాప్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన యంత్రాంగం, సర్వే నెంబర్ల వారీగా నష్టం వివరాల జాబితాను సోషల్ ఆడిట్ కోసం సిద్ధం చేశారు. 31,400 మంది రైతులకు పంట నష్ట పరిహారం అందనుంది. వ్యవసాయ పంటలకు సంబంధించి 41,531 ఎకరాలకు నష్టం వాటిల్లగా, ప్రభావిత రైతుల సంఖ్యను 25,600గా యంత్రాంగం తెలిపింది. నష్టపోయిన పంటలో వరి వాటానే 40,000 ఎకరాలుగా ఉంది. ఉద్యాన పంటల విషయంలో 5,800 మంది రైతులకు 8,800 ఎకరాలు దెబ్బతిన్నట్లు జాబితాలో నమోదు చేశారు. ముంపు బారిన పడిన 24 లంక గ్రామాలకు సంబంధించి మొత్తం 7970 ఇళ్లకు సంబంధించి జరిగిన నష్టం వివరాలను రెవెన్యూ సిబ్బంది ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసింది. పూర్తిగా మునిగినవి, పాక్షికంగా దెబ్బతిన్నవి, మరమ్మతులకయ్యే ఖర్చుతో పాటు ఇళ్లలో దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు.. అంశాల వారీగా నష్టం వివరాలు యాప్‌లో నమోదు చేశారు.

బాధితులకు సాయం విషయంలో..

ఉదారంగా సాయం అందిస్తుందని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన బాధితులకు సాంత్వన చేకూర్చేలా ఉంది. ముఖ్యంగా పంట నష్టం విషయంలో గతంతో పోలిస్తే పెంచి సాయాన్ని అందిస్తామని చెప్పడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరికి సంబంధించి హెక్టారుకు రూ.17,000 ఇన్‌పుట్ సబ్సిడీ అందేది. కానీ తాజాగా ముఖ్యమంత్రి హెక్టారుకు రూ.25,000 సాయం అందిస్తామని చెప్పడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంతో పోలిస్తే ఉద్యాన పైర్ల విషయంలోనూ ఉదారంగా సాయం చేస్తామని ప్రభుత్వం తెలపడంతో బాధిత రైతులకు ఊరట దక్కింది. పరిహారం పెంపు విషయంలో అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు



పంట నష్టం వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు (పాతచిత్రం)

మార్పులు.. చేర్పులకు అవకాశం...

పంట నష్టం గణన వారం క్రితమే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశించడంతో మొత్తం ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. దీంతో నష్టం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. వెంటనే ఆ జాబితాలను సోషల్ ఆడిట్ కోసం బుధ, గురు రెండు రోజుల పాటు గ్రామాలలో ప్రదర్శించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తొలి రోజయినా బుధవారం పెద్దసంఖ్యలో రైతులు తమ పేర్లు జాబితాలో లేవనే అంశాన్ని వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. నష్ట పరిహారం విషయంలో అర్హత కలిగిన రైతులందరి పేర్లను సర్వే నెంబర్లతో నమోదు చేస్తామని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయశాఖ చెబుతోంది. వాస్తవానికి నష్టం విషయంలో ప్రాథమిక అంచనాలతో పోలిస్తే తుది జాబితాలో భారీగా కోత పడింది. దీంతో సోషల్ ఆడిట్‌లో భాగంగా రైతుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞాపనలు వచ్చే అవకాశం ఉంది. సోషల్ ఆడిట్‌లో భాగంగా అన్నదాతల నుంచి వచ్చే అర్జీలకు జాబితాలో స్థానం కల్పించి తుది జాబితాను వ్యవసాయ శాఖ రేపు ప్రభుత్వానికి అందించనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి పక్కన జేసీ ప్రఖర్‌జైన్.

వందరోజుల లక్ష్యాన్ని చేరుకోవాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 18: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో 100 రోజుల లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. పలు శాఖల అధికారులతో ఆయన బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. లక్ష్యసాధనలో అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన భూములపై నివేదికివ్వాలి

నిషేధిత భూముల జాబితా 22 ఏ నుంచి తొలిగించిన భూముల వివరాలపై తహసీల్దార్లు నివేదికివ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీక్షణా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూములపై సమగ్రంగా రూపొందించిన నివేదికను ఈ నెల 21లోగా అందించాలన్నారు. నివేదిక తయారీలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చుక్కల భూములు, షరతులు గల పట్టా భూమి వివరాలు స్పష్టంగా పొందుపర్చాలని కలెక్టర్ చెప్పారు. సర్వీస్ ఇనామ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టం ఉల్లంఘనకు గురైందా లేదా అనే విషయాలను స్పష్టంగా పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలిగించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆర్ఎస్ఆర్‌తో సరి చూసుకోవాలన్నారు. అసైన్డ్ భూములలో 20 ఏళ్ళగా ఉన్న వ్యక్తులు మాత్రమే ఆ భూమిని అనుభవిస్తుంటే ఆ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్‌లు పరిశీలించి నివేదించాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చట్టాలను ఉల్లంఘించిన వాటిని తహసీల్దార్‌లు ధ్రువీకరించి నివేదిక పంపాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు.

సరిదిద్దుకుందామా.. సర్దుకుపోదామా

● సబ్ ట్రెజరీ కార్యాలయ తీరుపై ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టర్లలో చర్చ

● విచారణ నివేదికను కలెక్టర్‌కు, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్ డైరెక్టర్‌కు అందజేసిన డీటీవో

చీరాల, సెప్టెంబరు 18: చీరాల సబ్ ట్రెజరీ ఆఫీస్ కార్యాలయంలో ఉద్యోగుల వర్గపోరు, అవినీతి, ఆదాయ వనరులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి డీటీవో శివకామేశ్వరి బుధవారం కలెక్టర్ వెంకటమురళికి నివేదికను అందజేశారు. మంగళవారం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు కూడా డీటీవో వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కార్యాలయం ఉద్యోగులు సరిదిద్దుకుందామా.. సర్దుకుపోదామా అనే కోణంలో తాజాగా మంతనాలు జరిపినట్లు సమాచారం. సరిదిద్దుకోవడమంటే అవినీతి సొమ్ముకు ఆశించకుండా పర్సంటేజీ పద్ధతికి స్వస్తి పలకడం, లేదా తాత్కాలికంగా తమలో ఉన్న విభేధాలను పక్కనపెట్టి సర్దుకుపోయి పర్సంటేజీల పర్వాన్ని కొనసాగించడం అన్నదానిపై మంతానాల సాగినట్లు తెలుస్తుంది. అయితే అందుకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవలేదని సమాచారం. ఎస్టీవో, ఓ సీనియర్ అకౌంటెంట్ ఒక వర్గంగాను, మిగిలిన ఉద్యోగులు మరోవర్గంగా ముందస్తుగా ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో నూతన ఆఫీస్ ఆర్డరకు సంబంధించి విభేదాలు వీధికెక్కాయి. ఆ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, డీటీవో శివకామేశ్వరి విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 15న విచారణ క్రమంలో నూతన ఆఫీస్ ఆర్డర్‌ను అంగీకరిస్తూ సంబంధిత కార్యాలయ ఉద్యోగులు సంతకాలు చేశారు. పెండింగ్ బిల్లులను పాస్ చేశారు. పూర్తి విచారణ నివేదికను డీటీవో శివకామేశ్వరి కలెక్టర్‌కు అందజేశారు. ఆ నివేదికను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్‌కు కూడా అందజేస్తారు. నివేదక ఆధారంగా అధికారులు ఏం చర్యలు తీసుకుంటారనే విషయం అటుంచితే ఎవరిపైనా వేటు పడకుండా పరిస్థితిని చక్కదిద్దుకోవాలనే దిశగా ఎస్టీవో, ఇతర కార్యాలయ ఉద్యోగులు మంతనాలు జరపడం కొసమెరుపు. ఇక ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అన్ని విషయాలను ఖండిస్తున్నా

జరిగిన పరిణామాలకు సంబంధించి అన్ని విషయాలను ఖండిస్తున్నాను. బిల్లులకు పర్సంటేజీలు వసూలు చేస్తారా అన్న ప్రశ్నకు కూడా దాన్ని ఖండిస్తున్నా. అనారోగ్యం కారణంగా కొన్ని పొరపాట్లు జరిగాయి. భవిష్యతలో ఏ పొరపాట్లు జరగకుండా చూసుకుంటాను.

- భాగ్యలక్ష్మి, ఎస్టీవో, చీరాల.



చీరాల సబ్‌ట్రెజరీ కార్యాలయం



అరకొర దొరికిన మత్స్యసంపద

చిక్కని చేప.. గాడిన పడని వేట

వాయుగుండం తర్వాత మారిన పరిస్థితులు

చీరాల, సెప్టెంబరు 18: వాయుగుండం అనంతరం సముద్ర గర్భంలో చోటుచేసుకున్న మార్పులు స్థానిక మత్స్యకారుల ఉపాధిని దెబ్బ తీసింది. చేపలు చిక్కడం లేదు. వేటకు పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని కొందరు వాపోతున్నారు. వాయుగుండం ప్రభావంతో కొద్ది రోజులు సముద్రంలో వేట ఆగింది. సారంగులు, కళాసీలు ఆ సమయంలో ఒకింత ఇబ్బంది పడ్డారు. వేట గాడిన పడితే నాలుగు రూపాయలు కళ్లచూస్తామనుకున్న వారి ఆశలు అడియాశలవుతున్నాయి. వర్షాలు ఆగిన తర్వాత వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు మత్స్యసంపద సక్రమంగా దొరకడం లేదు. సాధారణంగా వాయుగుండాల తర్వాత సముద్రంలో మత్స్యసంపద బాగానే వలకు చిక్కుతుంది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని మత్స్యకారులు వాపోతున్నారు. కారణం అంతుచిక్కడం లేదని ఆందోళన చెందుతున్నారు. వాతారణ మార్పుల నుంచి వచ్చే ప్రతికూల పరిస్థితులతో వేటాడేందుకు చేసిన ఖర్చు కూడా తిరిగి రాకపోవడంతో, మరలా వేటకు కొంతమేర అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వారంలో శనివారం రోజు జరిగే మార్కెట్‌కు ఒకింత గిరాకీ ఉంటుంది. దీంతో సాధారణ రోజులుకన్నా ఆ రోజు తాము వేటాడిన మత్స్యసంపదకు అదనపు ధర లభిస్తుంది. అయితే గత రెండు వారాలుగా ఆ పరిస్థితి లేదని మత్స్యకారులు చెప్తున్నారు. త్వరలోనే సముద్రగర్భం యథాస్థితికి వస్తుందని, తమకు అనుకూలంగా పరిస్థితులు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 19 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళలపైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాఖీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు.. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యూజ్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణులతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్‌ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్‌ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్‌ఈటీ)' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్‌ఎల్‌ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్‌ఎల్‌ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి

● లోకేశ్‌కు తాడేపల్లి వాసుల వినతి

● 32వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 18: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు భారీగా ప్రజలు విచ్చేసి అర్జీలు సమర్పిస్తున్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి, ప్రాతూరు గ్రామ రైతులు మంత్రి లోకేశ్‌ను కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంచనపల్లి ప్రాతూరు లంక పొలాల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం అందించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఇటీవల సంభవించిన వరదలకు 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి నగర్‌లో తమ ఇళ్లలోకి నీరు చేరి ఇంటిలోని వస్తువులు పాడైపోయాయని ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో వ్యాపారాలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని డిగ్రీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన ఆర్ సాయికుమారి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీతానగరంలో గత 30 ఏళ్లుగా తన పేరుపై రిజిష్టరు అయిన ఉన్న ఇంటి స్థలాన్ని మేడా వెంకటేశ్వరరావు, అతని సోదరులు ఆక్రమించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన హేమాద్రి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని గవర్నమెంట్, కాంట్రాక్ట్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారని చిత్తూరుకు చెందిన 87 మంది హోం గార్డులు విజ్ఞప్తి చేశారు. చీరాల నియోజకవర్గం రామాపురం గ్రామస్తులు లోకేశ్‌ను కలిసి వైసీపీ ప్రభుత్వ హయాంలో 230 మందిపై టీడీపీ సానుభూతిపరులనే నెపంతో అక్రమ కేసులు పెట్టి వేధించారన్నారు.

ఫోర్జరీ ధ్రువ పత్రాలపై ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 18: పురపాలక సంఘ పరిధిలో తన పేరు, సర్వేయర్ సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షమ్మి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన గొల్లపల్లి వెంకటరావు తనకు పట్టణంలో పలు సర్వే నంబర్లలో ఖాళీ స్థలం ఉందని, పట్టణ ప్రణాళికా విభాగం నుంచి తప్పుడు ఎండార్స్‌మెంట్ సృష్టించి కృష్ణా జిల్లా మైలవరంలో ఆ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించటంపై ఇటీవల పట్టణ సర్వేయర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ పట్టణానికి చెందిన చల్లా శివమ్మకు సర్వే నంబరు 133-3లో ఖాళీ స్థలం ఉన్నట్టు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇచ్చినట్టు కొంతమంది తప్పుడు ఎండార్స్‌మెంట్ సృష్టించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్, టౌన్ సర్వేయర్ సంతకాలు ఫోర్జరీ చేశారు. చల్లా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పేరుతో కూడా కమిషనర్, సర్వేయర్ ఇచ్చినట్టు తప్పుడు దస్తావేజులు గుర్తించారు. ఈ సమాచారం కమిషనర్ దృష్టికి వెళ్లటంతో తమ సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించిన గొల్లపల్లి వెంకటరావు, చల్లా శివమ్మ, చల్లా వెంకటేశ్వర్లులను విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ షమ్మి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాధితులను ఆదుకునేందుకు మేమున్నామంటూ..



చంద్రబాబు నాయుడుకు రూ.35,08,800 డీడీ అందజేస్తున్న బూర్ల రామాంజనేయులు, నియోజకవర్గ నాయకులు

ఎమ్మెల్యే బూర్ల ఆధ్వర్యంలో రూ.35 లక్షలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో పర్యటించి రూ.35 లక్షల విరాళాల్ని సేకరించారు. ఈ మొత్తం విరాళాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, ఇతర నాయకులతో కలిసి రూ.35,08,800 డీడీని సీఎం చంద్రబాబుకు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకులు భీమనేని వందనాదేవి, నాయకులు గింజపల్లి శివరాం ప్రసాద్, మన్నవ పూర్ణచంద్రరావు, ఇమ్మడి లీలామల్లేశ్వరరావు, గువ్వల సునీల్ చౌదరి, గింజపల్లి వెంకటేశ్వరరావు, పంగులూరి రామకృష్ణ రామినేని శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవాది రూ.2.35 లక్షల విరాళం

వినుకొండ, సెప్టెంబరు 18: హైకోర్టు సీనియర్ న్యాయవాది ముత్తినేని కోటేశ్వరరావు, సునీత దంపతులు సచివాలయంలో మంత్రి నారా లోకేశ్‌ని కలిసి రూ.2.35 లక్షల చెక్కును బుధవారం అందజేశారు.



లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ముత్తినేని కోటేశ్వరరావు దంపతులు

డీఎస్సార్ ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: వరద బాధితులకు దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలబడ్డారు. బుధవారం ఉండవల్లిలోని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నివాసంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ చేతుల మీదగా రూ.6,01,116 చెక్కును అందజేశారు. దామచర్ల శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, నెల్లూరి కాశయ్య, మొవ్వా వేణుబాబు, కందే శ్రీనివాస్, సురేష్, దామచర్ల వంశీకృష్ణ, కోడెల బాలాజీ, ఆనంద కుమార్, డీఎన్‌డీఎల్ సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న మధుబాబు

డెర్మటాలజిస్టుల రూ.5 లక్షలు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయం కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ శాఖ తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, కార్యదర్శి డాక్టర్ సౌజన్య, విజయవాడకు చెందిన డాక్టర్ అనురాధ, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు.



చెక్కు అందజేస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు దంపతులు



సీఎం చంద్రబాబుకు రూ. 20 లక్షల చెక్కు అందజేస్తున్న గడ్డిపాటి సుధాకర్ దంపతులు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ

బలిజేపల్లి గ్రామస్తులు రూ. 2 లక్షలు

రాజుపాలెం, సెప్టెంబరు 18: మండలంలోని బలిజేపల్లి గ్రామస్తులు తమ వంతుగా రూ.2లక్షలు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి చెక్కును అందజేశారు.

మధుబాబు ఆధ్వర్యంలో రూ. 10 లక్షలు

దుర్గి, సెప్టెంబరు 18: టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు బుధవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు గృహానికి వెళ్లి రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. లింగా బ్రహ్మయ్య, మునగాకుల రామలక్ష్మయ్య, గాలి శ్రీను, తక్కెళ్లపాటి పెద్దబ్బాయి, యాగంటి వెంకటేశ్వర్లు, నిదానంపాటి అమ్మవారి ఆలయ చైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న కవిత, సౌజన్య, అనూరాధ

గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్-రే ఓనర్స్ అసోసియేషన్ వితరణ

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. రూ. లక్ష ఆర్థిక సహాయంతో పాటు సుమారు 10 వేల మందికి ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా రక్త పరీక్షలతో పాటుగా నిత్య అవసరాల పంపిణీలో కూడా పాలుపంచుకొన్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి తెలిపారు. సెక్రెటరీ తాడే కోరు శ్రీహరి, నగర అధ్యక్షుడు వెంకట లక్ష్మణ్, సెక్రెటరీ బి.శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్ వి రమణ, నేషనల్ ఎక్స్‌రే కృష్ణ, మహమ్మద్ మస్తాన్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్-రే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

రూ. 2.50 లక్షల చెక్కు అందజేత..

గుంటూరు, సెప్టెంబరు 18: నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుడివాడ జయకుమార్ నేతృత్వంలోని బృందం బుధవారం మంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలసి వరద బాధితుల సహాయార్థం రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్క అందజేస్తున్న శరత్‌బాబు



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్, డీఎస్సార్ ఫ్రెండ్స్ సభ్యులు

ఆర్టీసీ రిటైర్డ్ అధికారి రూ. లక్ష సాయం

రోటరీ క్లబ్ సెంటినల్ సభ్యులు, అమ్మనాన్న ఛారిటబుల్ సభ్యులు, ఆర్టీసీ రిటైర్డ్ అధికారి గోకనకొండ శరత్‌బాబు వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష సాయం చేశారు. సీఎం చంద్రబాబును కలిసి రూ. లక్ష చెక్కును అందజేశారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 18 : తెనాలికి చెందిన దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. సీఎం చంద్రబాబుకు బుధవారం చెక్కు అందజేశారు. ప్రొఫెసర్ ముద్దన కోటేశ్వరరావు, డాక్టర్ ముద్దన కస్తూరిబాయి, వాసిరెడ్డి శ్రీకాంత్‌లు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుకి రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న బలిజేపల్లి గ్రామస్తులు

లాఫింగ్ క్లబ్ సభ్యుల చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: వరద బాధితులకు లాఫింగ్ క్లబ్ సభ్యులు, ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు అండగా నిలబడ్డారు. క్లబ్ తరుపున రూ 2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పి శ్రీనివాసులుకి అందజేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడు పెద్ది శివరామ్ ప్రసాదు, సభ్యులు దర్మా కిషోర్, సంధ్య, లక్ష్మీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయకుమార్, నరేంద్ర

పెదకాకాని, సెప్టెంబరు 18: ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్, రోటరీ క్లబ్ సెంటినల్ సభ్యులు, అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గోకనకొండ శరత్ బాబు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ నాయకులు పిల్లి మాణిక్యారావు, జర్నలిస్ట్ కుమార్ పాల్గొన్నారు.

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: గుంటూరు మెడికల్ కళాశాల 1990 ఏడాదికి చెందిన వైద్య విద్యార్థులు వరద బాధితులకి చేయూతనిచ్చారు. చల్లపల్లి మండలం, అముద్రలంక గ్రామంలో నష్టపోయిన వరద బాధితులకు బుధవారం 500 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు.



కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న లాఫింగ్ క్లబ్ సభ్యులు

ట్రాక్టర్ డ్రైవర్ దారుణ హత్య



శివరామకృష్ణ (ఫైల్ ఫొటో)

కొల్లూరు, సెప్టెంబరు 18 : నిద్రిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను ఓ యువకుడు గుదిబండతో కొట్టి హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పోతార్లంక గ్రామానికి చెందిన దంతాల శివరామకృష్ణ అలియాస్ శ్రీరామయ్య (32) పంచాయతీ కార్యాలయం వద్ద బల్లపై పడుకుని నిద్రిస్తున్నాడు. పక్కనే గ్రామానికి చెందిన విష్ణు మొలకల తరుణ్‌సాయి తన స్నేహితులతో మద్యం తాగి వారు వెళ్లిన అనంతరం నిద్రిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను గుదిబండతో కొట్టి చంపాడు. పైగా డ్రైవర్ సోదరుడు విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి మీ అన్నను హత్య చేశాను శవాన్ని తీసుకు వెళ్లాలని చెప్పడంతో డ్రైవర్ సోదరుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు వివరించాడు. సమాచారం అందుకున్న సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు పోతార్లంక చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు విచారించగా హత్యకు గురైన డ్రైవర్ తన భార్యతో యువకుడిని మాట్లాడవద్దని మందలించడంతో కక్ష పెంచుకుని ఈ దారుణానికి ఒడి గట్టాడని పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఆర్నెల్ల క్రితం పొన్నూరు మండలం మామిళ్లపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

మంగళగిరి, సెప్టెంబరు 18: నగదు తీసుకుని చెల్లించని కారణంగా ఫిర్యాదుదారుడు నిందితుడు ఇచ్చిన చెక్కును బ్యాంక్‌లో వేయగా నగదు లేదని రావడంతో ఫిర్యాదుదారుడు నిందితునిపై మంగళగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. ఈ కేసులో వాదోపవాదనల అనంతరం నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.2.50లక్షల కాంపెన్సేషన్ ఫిర్యాదుదారునికి చెల్లించాలంటూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. మంగళగిరికి చెందిన దర్శి పాండురంగ విఠల్ వద్ద స్థానికంగా ఉండే శాంబ్రావు పెదకోటయ్య రూ.2 లక్షలు కుటుంబ ఖర్చు నిమిత్తం తీసుకుని 2018లో ప్రో నోటు రాశారు. అనంతరం 2020లో రూ.5,50,000లకు చెక్కును ఫిర్యాదుదారునికి అందజేయగా అతను సదరు చెక్కును తన బ్యాంకు ఎస్‌బీఐ మంగళగిరిలో వేయగా నగదు లేదని రావడంతో న్యాయవాది ద్వారా నోటీసు ఇచ్చి కోర్టులో కేసు దాఖలు చేశారు. వాదోపవాదనల అనంతరం నిందితునిపై నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2.50లక్షల కాంపెన్సేషన్ ఫిర్యాదుదారుడికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కర్నూలు జిల్లా ఎద్దులకు ప్రథమ స్థానం



కర్నూలు జిల్లా ఎద్దులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18: ప్రత్తిపాడులో జరుగుతున్న జాతీయ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగుతున్నాయి. మూడో రోజున నాలుగు పళ్ల విభాగంలో పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీలలో కర్నూలు జిల్లా బి తాండ్రపాడుకు చెందిన ఏ. చినరత్నంకు చెందిన ఎద్దులు 5100 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ప్రకాశం జిల్లా కొమరోలు మండలం పాములపల్లి గ్రామానికి చెందిన గోపు వెంకటేశ్వరరెడ్డి ఎద్దుల జత 4759.6 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లా సంజాముల మండలం, నుస్సాం గ్రామానికి చెందిన కొనుదుల హరినాథ్ రెడ్డి ఎద్దుల జత 4640.1 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లా కలసపాడుకు చెందిన బొతి వెంకటరెడ్డి ఎద్దుల జత 4608.2 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా మాచవరంకు చెందిన అత్తులూరి లక్ష్మీ తిరుపతమ్మ ఎద్దుల జత 4560.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా కారంచేడు మండలం, కొశవరప్పాడుకు చెందిన గంటా సుబ్బయ్య ఎద్దుల జత 4492.8 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన లింగసాయి నాయుడు కు చెందిన ఎద్దులు 4290.3 అడుగుల దూరం లాగి 7వ స్థానంలో, రాచర్ల మండలం అక్కపల్లెకు చెందిన బత్తుల భూపాల్ ఎద్దుల జత 4200 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో నిలిచాయి. ఈ స్థానాలు సాధించిన వారికి కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా

కొల్లూరు, సెప్టెంబరు 18 : కృష్ణానదికి వరద నీరు క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసూరులు విజృంభిస్తున్నారు. అర్ధరాత్రిళ్లు అరవింద వారధికి అత్యంత సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. అరవింద వారధి వద్ద ఇసుక అక్రమ రవాణాను నిలువరించేందుకు రెవెన్యూ, పోలీసులను నిఘా ఉంచినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి, గాజుల్లంక గ్రామాల పరిధిలో ప్రతిరోజూ అర్ధరాత్రుళ్లు కృష్ణానదిలో అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుంది. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన నిఘా బృందాలు అక్రమ ఇసుకాసూరుల నుంచి మామూళ్లు తీసుకుని ట్రాక్టర్లను అడ్డుకోకుండా వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా అక్రమ రవాణా చేసే కొంతమంది మరికొందరి ట్రాక్టర్లు ఇసుక రవాణా కోసం వచ్చి కృష్ణానదిలో ఇసుకను నింపుకుని వెళుతుంటే ఓర్వలేక ఆయా ట్రాక్టర్లను మామూళ్లకు అలవాటు పడిన రెవెన్యూ, పోలీసు సిబ్బందికి సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారు. చేతివాటానికి అలవాటు పడిన ఆయా శాఖల సిబ్బంది సైతం ఇసుకాసూరులు చెప్పినట్లుగా వింటూ ఆ వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వాహనాలు సైతం బడా నాయకులు సిఫారసులతో పోలీసులు విడిచి పెడుతున్నారు. కేసులు లేకుండా వాటిని వదిలి వేసేందుకు ఒక్కొక్క ట్రాక్టర్‌కు భారీగా నగదును ఆ ట్రాక్టర్ల యజమానులు ముట్టజెప్పుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎగువ లంక గ్రామాల ప్రజల కోసం నిర్మించిన అరవింద వారధి వద్దే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వీటి వల్ల వంతెనకు ప్రమాదం ఏర్పడుతుందని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్ల పాటు వంతెన కోసం ప్రభుత్వాల చుట్టు ప్రదక్షిణలు చేసి సాధించుకున్న వంతెనకు ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ముప్పు ఏర్పడే పరిస్థితులు తలెత్తుతున్న అధికార యంత్రాంగం మాత్రం అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయలేకపోతున్నాయి. మామూళ్ల మత్తు నుంచి వీడి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పోలీసు, రెవెన్యూ శాఖలను లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

అమృతలూరు, సెప్టెంబరు 18 : మూల్పూరులో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తాతా సాంబశివరావు (35) అనే కౌలురైతు 10 ఎకరాలు మాగాణి భూమి సాగు చేస్తున్నాడు. గతేడాది తుఫాను కారణంగా వేసి పంట నేలపాలు కావడంతో చేతికి ఏమి రాలేదు. పంట తీవ్ర స్థాయిలో దెబ్బతినడంతో దమ్ము చేయించాడు. దీంతో ఆర్థికంగా నష్టపోవంతోపాటు, అప్పులు పాలు అయ్యాడు. ఈ ఏడాది కూడా వెద సాగు చేపట్టాడు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర పంట ముంపునకు గురి కావడంతోపాటు, నాటు వేసిన పొలంలో మందులు పిచికారి చేసినా కలుపు అదుపు కాలేదు. దీంతో మనస్తాపంతో మంగళవారం ఉదయం నుంచి పొలం వద్దే ఉన్నాడు. భార్య పొలంలో పని చేస్తున్న క్రమంలో మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాంబశివరావుకు భార్య, 5ఏళ్ల బాలిక, మూడేళ్ల బాలుడు ఉన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సాంబశివరావు ఇంటికి, సాగు చేస్తున్న పొలంను పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో వెనుదిరిగారు. దీనిపై పోలీసులకు ఏలాంటి సమాచారం అందలేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

ఆలపాడు ఫిషర్‌మన్ సొసైటీ సమావేశంలో ఉద్రిక్తత

చుండూరు, సెప్టెంబరు 18: ఆలపాడు ఫిషర్‌మన్ సొసైటీ సమావేశం గురువారం ఆలపాడులో జరిగింది. ఈ సందర్భంగా సభ్యుల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి హిమజ సమావేశానికి సంబంధించిన ఎజెండాను ముందుగా సభ్యులకు తెలపకుండా సొసైటీ ఎన్నికలు నిర్వహించాలంటూ సమావేశంలో పేర్కొంది. దీనితో సభ్యుల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంది. సొసైటీ విషయంలో అధికారులు ఒక వర్గానికి తలొగ్గి ఆకస్మికంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారంటూ భావించి గ్రామంలోని తమ తమ వర్గాలకు సమాచారం అందించారు. దీనితో గ్రామంలో రెండు వర్గాల వారు వందల మంది సమావేశ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య దాడులు, తోపులాటలు జరగడంతో చుండూరు పోలీసులు సమావేశ ప్రాంతానికి చేరుకుని ఇరువర్గాలను విడదీసి గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. చెరువుల విషయం గతంలో జరిగిన అవకతవకలు, లెక్కలు తేల్చకుండా ఎన్నికలు ఏ విధంగా నిర్వహిస్తారు. ముందస్తుగా ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ఎఫ్‌డీవోలు సభ్యులు, గ్రామస్థులు నిలదీయగా ఇది సర్వసభ్య సమావేశమేనంటూ సర్ది చెప్పి కలెక్టర్ ఆదేశాలతో సొసైటీ ఎన్నికలు నిర్వహిస్తానంటూ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించింది. అయిన గాని గ్రామంలో ఉద్రిక్తతలు చల్లారకపోవడంతో పోలీసు పికెట్ కొనసాగుతోంది.

శిక్షణకు అవసరమైన వసతుల పరిశీలన

బాపట్ల, సెప్టెంబరు 18: నిరుద్యోగ యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు అవసరమైన కళాశాలలో వసతులను బుధవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ తమ్మాజీరావు, జాతీయ మత్స్యకార సంఘం నాయకులు అనంత నగేష్‌బాబు, నైపుణ్య కళాశాల కోఆర్డినేటర్ ఎం బుల్లియ్యలు పరిశీలించారు. 60 మంది యువతకు ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ ల్యాబ్ సూపర్‌వైజర్, ఆక్వాకల్చర్ టెక్నికల్ సూపర్‌వైజర్ కోర్సులలో మూడునెలలు పాటు శిక్షణనివ్వనున్నట్లు వారు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, ఆహారం అందించడమేకాకుండా సర్టిఫికెట్లు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీబీసీ రోడ్డులోని కొత్తపాలెం మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న నైపుణ్య కళాశాలలో చేరేందుకు పలువురు ధరఖాస్తు చేసుకున్నారు.

జాతీయ వాటర్‌పోల్ పోటీలకు బాపట్ల యువకుడు ఎంపిక



బాపట్ల రూరల్, సెప్టెంబరు 18 : జాతీయ వాటర్ పోల్ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి ఉప్పాల డొనాల్డ్ వెంకటగౌడ్ అనే యువకుడు ఎంపికయ్యాడు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు (తిరువనంతపురం) కేరళలో జరిగే 77వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ -2024 నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడు.

పోటీలకు ఎంపికైన ఉప్పాల డొనాల్డ్ వెంకటగౌడ్

ఆవులను శ్రీశైల గోఆశ్రమానికి తరలిస్తాం : కమిషనర్

బాపట్ల, సెప్టెంబరు 18 : పట్టణంలో రోడ్లపై సంచరిస్తూ ప్రమాదాలకు కారణమౌతున్న ఆవులను యజమానులు తమ ఇళ్లకు తీసుకెళ్లాలని లేకుంటే శ్రీశైల గోఆశ్రమానికి తరలిస్తామని కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. దీనిపై అనేక పర్యాయాలు నోటీసులు జారీ చేసిన యజమానులు ఆవులను రోడ్ల మీదకు వదిలేయటం వల్ల పారిశుధ్యంకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గత నెల కొన్ని ఆవులను పట్టుకున్నామన్నారు. అయినప్పటికీ ఆవుల యజమానులు వచ్చి తీసుకెళ్లలేదు కాబట్టి వాటిని గోఆశ్రమానికి తరలిస్తామని తెలియజేశారు.

స్నేక్ డ్రైవ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు

బాపట్ల, సెప్టెంబరు 18: పాఠశాలలు, కళాశాలలు వదిలిపెట్టే సమయంలో కొంతమంది ఆకతాయిలు బైకలతో స్నేక్ డ్రైవ్ చేస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఆర్ అహ్మద్ జానీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది యువకులు నెంబర్ ప్లేట్‌లు లేకుండా నడుపుతూ పెద్దపెద్ద శబ్దాలతో ఎక్స్‌లేటర్ రైజ్ చేసి అమ్మాయిలను భయపెడుతున్నారన్నారు. కావున దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, ఏపూరి జోసఫ్‌లు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి : సీడీపీవో



అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహిస్తున్న సీడీపీవో లక్ష్మీపార్వతి

బాపట్ల, సెప్టెంబరు 18: గర్భిణీ, బాలింతలు, కిశోరబాలికలు పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో లక్ష్మీ పార్వతి తెలిపారు. పట్టణంలోని 30వవార్డు ఇస్లాంపేట-కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త సయ్యద్ కరీమున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అనేకమంది రక్తహీనతతో బాధపడుతుంటారని దీని నియంత్రణకు పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు తీసుకోవటం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం కోసం ఐసీడీఎస్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

తాడిగిరిపాడులో పోషణ మాసోత్సవాలు, స్వచ్ఛత హీ సేవ

కొల్లూరు, సెప్టెంబరు 18: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు, స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను సూపర్‌వైజర్ విజయలక్ష్మి నిర్వహించారు. మండల పరిధిలోని తాడిగిరిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రేపల్లె, సెప్టెంబరు 18: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని ఎంసీపీ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాల్లో డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు జ్ఞాపకార్థం యూఎస్ఏలో ఉన్న డాక్టర్ జగదీష్ సహకారంతో మహిళలకు ఫ్యాషన్ డిజైన్‌లో 3వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 2వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బాపారావు, సత్యప్రసాద్, సాయిప్రసాద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల మందు పంపిణీ

చుండూరు, సెప్టెంబరు 18 : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం యడ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రేమ్‌చంద్, సిబ్బంది పాల్గొన్నారు.


సత్యసాయిబాబాకు పౌర్ణమి పూజలు

కర్లపాలెం, సెప్టెంబరు 18 : కర్లపాలెంలోని సత్యసాయిబాబా సేవా మందిరంలో షిరిడీ, సత్య సాయిబాబాకు బుధవారం వందలాది మంది భక్తులు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమలో సత్యసాయి గ్రామీణ సేవల జిల్లా కోఆర్డినేటర్ తుమ్మల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, సోమశేఖర్, సాయి లీలా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య శిబిరం

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 18 : భట్టిప్రోలులోని తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దంత వైద్య శిబి రం నిర్వహించారు. బుధవారం సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ తక్కెళ్లపాడు, గుంటూరు వారి సౌజన్యంతో కె.శ్రీనివాసరావు సహకారంతో విద్యార్థులకు దంత పరీక్షలు చేసి దంత లోపాలు ఉన్న వారిని గుర్తించి తగు సలహాలు, సూచనలు చేశారు.

పెద్దకాల్వ గండి పూడ్చివేత పనులు



పెద్దపల్లి కాల్వ గండిని పూడ్చడానికి ట్రాక్టర్‌తో మట్టి పోస్తున్న దృశ్యం

రేపల్లె, సెప్టెంబరు 18: ఇటీవల భారీ వర్షాలకు తెగిపోయిన కాల్వ గండి పూడిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బుధవారం పెద్దపల్లి సైఫన్‌కాల్వ కట్టగండి పడటంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో అధికారులు కాల్వకట్ట గండిపూడ్చే పనులు ప్రారంభించారు. గండి పూడ్చితే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని గుండేరు డ్రెయిన్

● కట్టలపై పక్కా గృహాల నిర్మాణం
● డ్రెయిన్‌లో నీరు ప్రవహించకుండా దారుల ఏర్పాటు
● ఎమ్మెల్యే ఆదేశాలు ఖాతరు చేయని అధికారులు



గుండేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటికాడ



కట్టలు ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్లు

వేమూరు, సెప్టెంబరు 18: మండలంలో 11 కి.మీల నిడివిలో మురుగునీరు ప్రవహిస్తున్న గుండేరు డ్రెయిన్ ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీనికి తోడు చదలవాడ వద్ద డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న కట్టలతో పాటు కాల్వలోకి కూడా స్థలాలు ఆక్రమించుకుని పక్కా గృహాలు నిర్మించారు. డ్రెయిన్‌లో తూటికాడతో పాటు ఇతర గ్రా మాల నుంచి వచ్చే వ్యర్థాలు, తుమ్మ చెట్లు వివిధ రకాల మొక్కలతో కాల్వ నిండిపోయింది. దీంతో పిడపర్తిపాలెం లాకుల నుంచి విడుదల య్యే మురుగునీరు ఎగువలోనే పూర్తిగా స్థంభించిపోతోంది. దీని వల్ల దాదాపుగా 15 వేల ఎకరాలకు చెందిన మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎగతంతున్నాయి. దిగువ రైతులు కొందరు సకాలంలో సాగునీరు అందని పక్షంలో డ్రెయిన్ నుంచి వచ్చే మురుగు నీటిని మోటార్ల సహాయంతో చేలకు వాడుకుంటున్నారు. ప్రస్తుతం డ్రెయిన్ పరిస్థితి దారుణంగా తయారైంది. అంతేగాక దిగువ కట్టలను వైసీపీ ప్రభు త్వ హయాంలో ఆ పార్టీ శ్రేణులైన కొందరు ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఆ మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ దృష్టి పెట్టకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రైతుల సూచనల మేరకు అత్యవసర చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు ఆదేశాల ను ఖాతరు చేయలేదు. రైతులు, నీటి పారుదల శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రెయిన్ మరమ్మతులతో పాటు ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

వైసీపీ పాలకుల వల్ల ఇబ్బంది..

వైసీపీ పాలకులు గుండేరు డ్రెయిన్ మరమ్మతులపై దృష్టి పెట్టని కారణంగా ప్రస్తుతం రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చదలవాడకు చెందిన రైతు మాలేంపాటి శ్రీనివాసరావు అంటున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టి నిధులను కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఏఈ రాంబాబు వివరణ

నీటి పారుదల శాఖ ఏఈ రాంబాబును వివరణ కోరగా కట్టలను టీడీపీ ప్రభుత్వంలో బలోపేతం చేశామని, తర్వాత వాటిని స్థానికులు కొందరు ఆక్రమించుకోవడంతో పాటు డ్రెయిన్‌లోనే మార్గాలను ఏర్పాటు చేసిన మాట వాస్తవమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిధుల కేటాయింపు లేని కారణంగా ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయామని అన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక నిధుల కేటాయింపు కోసంగా రూ.14.30 లక్షల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధుల కేటాయింపు జరగ్గానే దావులూరు నుంచి వరహాపురం వరకు డ్రెయిన్ పూడికలు తీయించడంతో పాటు ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదికగా ప్రజాదర్బార్

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 18 : ప్రజాసమస్యల పరిష్కారవేదికగా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు అర్జీల పరిస్థితి తెలియజేయాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పులి శరత్‌బాబు, తహసీల్దార్ శ్రీదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, ఇరిగేషన్ డీఈ రమణమూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఏబీఎం స్కూల్ నిర్వహణకు అనుమతులిప్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకు బుధవారం కస్టోడియల్ ఇనగలూరి మాల్యాద్రి, కమిటీ సెక్రటరి పి.ఆనంద్‌కుమార్‌లు వినతిపత్రం అందజేశారు.

వరద బాధితులకు లిటిల్ ఏంజెల్స్ స్కూల్ చేయూత

వరద ప్రభావంతో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతుగా లిటిల్‌ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం చేయూతనందించింది. బుధవారం రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్లు యు.రఘుకుమార్, జి.రమేష్, జి.ప్రభావతి, మేనేజింగ్ డైరెక్టర్ జి.అభినవ్‌లు తెలిపారు.

● బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత బోటనీ అధ్యాపకులు కాంద్రు సాంబశివరావు, కాంద్రు జనార్దనరావులు మేము సైతం అండగా ఉంటామంటూ రూ.50,116ల చెక్కును అంగలకుదురు సత్యనారాయణ ద్వారా బుధవారం ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, వెంకట్రావు, తదితరులున్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 18 : బాపట్ల మండలం పడమర పిన్ని బోయనవారిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సందర్శించి గణనాధుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో గవిని వెంకటనారాయణ, మద్దిబోయన సోమరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచడం దేశ సేవే

ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు



నల్లమోతువారిపాలెంలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ

కర్లపాలెం, సెప్టెంబరు 18 : స్వచ్ఛత హీ సేవ అంటే పరిసరాలను శుభ్రంగా ఉంచటమేనని అది కూడా దేశ సేవలో ఒక భాగమని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. నల్లమోతువారిపాలెంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొని గ్రీన్ అంబాసిడర్‌లకు మెడికల్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్‌ఆఫీసర్ అనూష, ఏఎన్ఎం రత్నమాల, ఇన్‌చార్జి ఎంపీడీవో ఏలీషాబాబు, కార్యదర్శి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో..

బాపట్ల, సెప్టెంబరు 18: పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల బుధవారం స్వభావ స్వచ్ఛత.. సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ విమల బీర పర్యవేక్షించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్లెస్సీ సాగర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 18: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే స్వచ్ఛత హీ సేవా లక్ష్యమని పిట్టలవానిపాలెం ఎంపీడీవో భవనం మారుతీ శేషమాంబ అన్నారు. మండలంలోని కోమలి, భవనం వారిపాలెం గ్రామ సచివాలయాల నందు బుధవారం ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు శ్యామలా నాగిరెడ్డి, మోదుగుల శివనాగేశ్వరిల ఆధ్వర్యంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ కె.పద్మజ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా టీడీపీ



అగ్ని బాధితులకు సాయం అందిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు

చెరుకుపల్లి, సెప్టెంబరు 18: ఆదపలో ఉన్న వారికి టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు. బుధవారం ఆళ్ళవారిపాలెంలో ఇటీవల విద్యుదాఘాతంతో సుందరరామయ్యకు చెందిన 5 పశువులు మంటల్లో కాలిపోయాయి. విషయాన్ని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రూ.20 వేలను టీడీపీ నాయకుల ద్వారా బాధితులకు అందజేశారు. గ్రామానికి చెందిన బాధితులకు రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకృష్ణ కె.శ్యామ్‌సుందర్, భాను, అశోక్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా కరుణ

బాపట్ల,సెప్టెంబరు 18 : మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా చేవూరి కరుణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డొక్కా కొండయ్య బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో కరుణను నియమించారు. గతంలో ఇక్కడ చేసిన అనుభవంతో శానిటరి విభాగంలో సమర్థవంతంగా పనిచేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య సేవలు

కర్లపాలెం, సెప్టెంబరు 18: కర్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యం లో వైద్య సిబ్బంది కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పారిశుధ్య సిబ్బందికి బుధవారం వైద్య సేవలందించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రేపల్లె, సెప్టెంబరు 18: నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం సీడాప్ ఆధ్వర్యంలో 20వ తేది స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. జాబ్‌మేళాలో రిలయన్స్ ట్రెండ్స్ అటెక్స్ సొల్యూషన్స్, టెక్సస్ కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని గూడవల్లి గ్రామంలో ఉన్న టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐలో 2024-25 విద్యాసంవత్సరంలో మిగిలిన కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్ శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్, మోటార్ మెకానిక్ డ్రాఫ్ట్‌మన్ సివిల్ సీట్లకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఈ నెల 26లోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

భార్యను బెదిరించిన భర్తకు నెల జైలు

బాపట్ల, సెప్టెంబరు 18: కేసు రాజీపడమని భార్యను బెదిరించి దాడి చేసిన కేసులో భర్తకు నెల జైలు విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామానికి చెందిన నిమ్మగడ్డ భానుశ్రీకి విశాఖపట్నంకు చెందిన నిమ్మగడ్డ శ్రీనివాస్‌తో 2014లో వివాహం జరిగింది. తదుపరి వీరిద్దరి మధ్య గొడవలు జరిగి బాపట్ల కోర్టులో కేసులు పెట్టుకున్నారు. సదరు కోర్టు వాయిదా సమయంలో భానుశ్రీని భర్త శ్రీనివాస్ రాజీపడమని బెదిరించి కొట్టటంతో చుట్టుపక్కలవారు విడిపించినట్లు 2018 నవంబరు నెలలో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ అనీల్‌కుమార్‌రెడ్డి దర్యాప్తు చేయగా తర్వాత వచ్చిన ఎస్ఐ ఎం రోశయ్య ఛార్జీషీట్ దాఖలు చేశారు. అనంతరం బాపట్ల కోర్టు నుంచి ఈ కేసు తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యింది. తెనాలి జడ్జి ఎ.పవన్ కుమార్ సాక్ష్యులను విచారించి కేసు నిరూపణ కావటంతో నిమ్మగడ్డ శ్రీనివాస్‌కు నెలజైలు లేదా వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ ఆర్ అహ్మద్ జానీ తెలిపారు. కేసులో ఏపీపీగా పరిశపోగు సునీల్‌కుమార్ వ్యవహరించారు.

హెచ్‌పీ గ్యాస్ డీలర్ సుబ్బారావు మృతి

బాపట్ల, సెప్టెంబరు 18 : ప్రముఖ వ్యాపారవేత్త, బాపట్ల, పొన్నూరు హెచ్‌పీ గ్యాస్ డీలర్, తిరుమల గ్యాస్ ఏజెన్సీ అధినేత గాదంశెట్టి సుబ్బారావు (78) బుధవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బాపట్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వంశీపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలపై కేసు

చెరుకుపల్లి, సెప్టెంబరు 18: గుళ్ళపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త వంశీపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ గుళ్ళపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఉల్లంగుంట రామారావు, శ్రీరామ్మూర్తి, వెంకటేశ్వరరావు, శివప్రసాద్, మామిళ్ళపల్లి శివకోటేశ్వరరావులపై కేసు నమోదు చేశామన్నారు. రేపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమావేశం

చుండూరు, సెప్టెంబరు 18: మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమావేశం ఈ నెల 21న తెనాలి వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న ట్లు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు కాళహస్తి గోపి బుధవారం వెల్లడించారు. మండలంలోని వేటపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంవీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొలకలూరి రాజన్ మాదిగ, కొలకలూరి మోహన్ మాదిగ, శివనాగేంద్ర మాదిగ, అత్తోట రాజు మాదిగ, శిఖాపల్లి సాంబయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

● మంత్రి నారా లోకేశ్‌ను కోరిన ఎంపీ కృష్ణప్రసాద్



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, సెప్టెంబరు 18 : బాపట్ల పార్లమెంట్ పరిధిలోని చీరాల నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ పరిధిలో ముఖ్య పట్టణంగా ఉన్న చీరాలలో ఐటి హబ్ ఏర్పాటు చేయటం ద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అంతేకాకుండా ఐటీ హబ్ ఏర్పాటుకు అన్ని అవకాశాలు ఉన్నాయని వివరించారు. తద్వారా వచ్చే ఫలితాలు గురించి చర్చించారు. వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి అందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తామని లోకేశ్ హామీనిచ్చారు.

నష్టపరిహారం పంపిణీకి సిద్ధంగా ఉండాలి

● రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

బాపట్ల, సెప్టెంబరు 18 : భారీవర్షాలు, వరద విపత్తుతో నష్టపోయిన కుటుంబాలకు ఈనెల 20వ తేదీన నష్టపరిహారం పంపిణికి సిద్ధంగా ఉండాలని ఏపీ విపత్తు నివారణ, రెవెన్యూశాఖ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం ఆయన రాష్ట్ర రాజధాని నుంచి అత్యవసర వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో జరిగిన నష్టంపై కలెక్టర్ జె.వెంకటమురళిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టం అంచనాలపై నివేదిక పంపాలని ఆదేశించారు. మత్స్యకారులు, చేనేతలు, వ్యవసాయ, ఉద్యానవన పంటలు తదితర అంశాలపై సమగ్రనివేదిక ఇవ్వాలన్నారు. బాపట్లజిల్లాలో 7,970 గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకొని దెబ్బతిన్నాయని కలెక్టర్ తెలిపారు. విపత్తుతో మూడు మండలాల్లోని 24గ్రామాలు నీటమునిగి దెబ్బతిన్నాయన్నారు. 30వేల మంది బాధితులయ్యారని తెలిపారు. 194 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 214 కచ్చా గృహాలు, 245 పూరిళ్ళు దెబ్బతిన్నాయని చెప్పారు. 24 గేదెలు, ఒకదున్నపోతు, 34 గొర్రెలు, మేకలు, 351 కోళ్ళు మృతి చెందాయన్నారు. నష్టపోయిన కుటుంబాల్లో 4 యానాది కుటుంబాలకు ఆధార్‌కార్డులు, బ్యాంక్‌ఖాతాలు లేవని వివరించారు. సదరు కుటుంబాలకు పరిహారం నేరుగా అందించేందుకు అనుమతినివ్వాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించిన మేరకు అత్యవసరంగా జిల్లాకు రూ.7.09 కోట్ల నిధులు కావాలని విన్నవించారు. పంట నష్టం వివరాలను లిఖిత పూర్వకంగా నివేదిక పంపుతామని తెలిపారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం తుది జాబితా విడుదల



అబ్బనగూడవల్లిలో పంట నష్టపోయిన రైతుల జాబితాను పరిశీలిస్తున్న రైతులు

వేమూరు, సెప్టెంబరు 18 : మండల పరిధి గ్రామాల్లో భారీ వర్షాలకు పంట దెబ్బతిన్న రైతుల తుది జాబితాను మండల వ్యవసాయశాఖ అధికారి సునీత బుధవారం విడుదల చేశారు. 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో 14500 ఎకరాల్లో వరి పైర్లు వేశారని వాటిలో ప్రత్యేక సర్వే ద్వారా 3509 మంది రైతులకు చెందిన 4962 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించామన్నారు. అబ్బనగూడవల్లిలో 187 మంది రైతులకు చెందిన 213.71 ఎకరాలు బలిజేపల్లిలో 27 మంది రైతులకు చెందిన 23.13 ఎకరాలు చదలవాడ పరిధిలో 149 ఎకరాల కు చెందిన 344.75 ఎకరాలు చావలి పరిధిలో 56 మంది రైతులకు చెందిన 925.57 ఎకరాలు, కుచ్చెళ్లపాడు పరిధిలో 216 మంది రైతులకు చెందిన 301.77 ఎకరాలు పెనుమర్రు పరిధిలో 543 మంది రైతులకు చెందిన 635.34 ఎకరాలు పెరవలి పరిధిలో 329 మంది రైతులకు చెందిన 622.77 ఎకరాలు పెరవలిపాలెం పరిధిలో 745 మంది రైతులకు చెందిన 1061.18 ఎకరాలు వరహాపురం పరిధిలో 66 మంది రైతులకు చెందిన 57.31 ఎకరాలు వేమూరు పరిధిలో 544 మంది రైతులకు చెందిన 688.62 ఎకరాలు దెబ్బతిన్నట్లుగా గుర్తించామని ఏవో తెలిపారు. తుది జాబితా వివరాలను ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపినట్లు తెలిపారు.

జాబితాలో రైతుల పేర్లు చూసుకోవాలి : ఏవో

చెరుకుపల్లి, సెప్టెంబరు 18: భారీ వర్షాలకు పైర్లు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందించేందుకు నష్టపోయిన రైతుల పేర్ల జాబితాను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఏవో టి.బాలాజీ గంగాధర్ తెలిపారు. రైతులు జాబితాలో తమ పేరు లేకపోతే వీఏఏలకు వెంటనే తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చిలుమూరులో బాధితులకు దుప్పట్ల పంపిణీ



బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సరళ, మైనేని

కొల్లూరు, సెప్టెంబరు 18: మండలపరిధిలోని చిలుమూరు లంకలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి జాస్తి సరళ ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆమెతో పాటు కార్యక్రమంలో పాల్గొని వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటా నరేష్, స్థానిక నాయకులు కోటా జాకబ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ చేసిన న్యాయవాదులు

కొల్లూరు, సెప్టెంబరు 18 : కృష్ణానదికి వచ్చిన వరదలతో పశువులకు గ్రాసం లేక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు చీరాలకు చెందిన న్యాయవాదులు ముందుకు వచ్చారు. రూ.25వేలతో ట్రాక్టర్ వరిగడ్డిని కొనుగోలు చేసి మండలపరిధిలోని తోకలవానిపాలెం గ్రామానికి తరలించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ ఏరియా మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ

రేపల్లె, సెప్టెంబరు 18: పాడి రైతులకు సంగం డెయిరీ అండగా ఉంటుందని రేపల్లె ఏరియా మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న అరవపల్లి పాలసేకరణ కేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59మంది పాల ఉత్పత్తిదారులకు రూ.3లక్షల 18వేల89లను పంపిణీ చేశారన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వేణుగోపి, కేంద్ర అధ్యక్షుడు భూపతి ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల ఇష్టారాజ్యం

పర్యవేక్షణ లేని పంచాయతీరాజ్

నాలుగు కీలక శాఖలకు పక్కశాఖల వారే దిక్కు

రెండింటికి గుంటూరు జిల్లా అధికారులు

క్షేత్రస్థాయిపై దృష్టిపెట్టని దుస్థితి

నామమాత్రంగానే విధుల నిర్వహణ

మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వ పెద్దలు

కొన్నిశాఖల్లో మొదలైన గందరగోళం

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖల్లో పర్యవేక్షణ కొరవడింది. ఆ విభాగంలో కీలకమైన నాలుగు శాఖల్లో జిల్లా అధికారులుగా ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. అందులో రెండింటికి ఆరు నెలలుగా కొనసాగుతుండగా, తాజాగా ఖాళీ అయిన రెండింటికి ఏకంగా సుదూరంగా ఉండే గుంటూరు జిల్లా అధికారులే దిక్కయ్యారు. దీంతో వారు మొక్కుబడిగా విధుల నిర్వహణ తప్ప క్షేత్రస్థాయి పర్యటనలు, సమీక్షలు, లోటుపాట్లు సరిదిద్దే ప్రయత్నాలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. కొందరు అధికారుల తీరుతో శాఖలలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. కొందరు కింది స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖల్లో ఇన్‌చార్జిల పాలన నడుస్తోంది. దీంతో అంతా అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చే అత్యంత కీలకమైన విభాగం పంచాయతీరాజ్. దాని పరిధిలోనే జిల్లాలో నాలుగు శాఖలు నడుస్తుంటాయి. అందులో మొత్తం గ్రామపంచాయతీల పర్యవేక్షణ జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో, మండల, జిల్లా పరిషత్‌ల పర్యవేక్షణ జిల్లా పరిషత్ సీఈఓ పర్యవేక్షణలో నడుస్తాయి. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలన వ్యవహారాలలో ఈ రెండు అత్యంత కీలకం. అలాగే గ్రామీణ ప్రజల మౌలిక అవసరాలైన రోడ్లు, డ్రైన్లు, వివిధ నిర్మాణాలను పర్యవేక్షించేది పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం. కాగా ఆ విభాగం ఎస్ఈ పర్యవేక్షణలో న డుస్తుంది. ఇక గ్రామీణ ప్రజల తాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ పరిధిలో ఉంటుంది.

పక్కజిల్లావారికి బాధ్యతలు

కాగా పంచాయతీరాజ్‌లో మరో ప్రధానమైన పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిస్థితి అలాగే ఉంది. ఇక్కడ పీఆర్ ఎస్ఈగా పనిచేస్తున్న కొండయ్య మే 31న పదవీ విరమణ చేయగా గుంటూరు ఎస్ఈగా ఉన్న జి.అశోక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. సాధారణంగా ఇలాంటి సమయంలో జిల్లాకేంద్రంలో లేదా కనీసం జిల్లాలో ద్వితీయశ్రేణిలో ఉండే ఈఈ స్థాయి అధికారికి ఇన్‌చార్జి ఇస్తారు. అయితే ఒంగోలు ఈఈ పోస్టు ఖాళీగా ఉండి కందుకూరు ఈఈ కోటేశ్వరరావు ఇక్కడ ఇన్‌చార్జిగా ఉండటం, మార్కాపురంలో ఉన్న రెండు ఈఈ పోస్టులకు ఒక్కరే ఉండటంతో గుంటూరు ఎస్ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు చెప్తున్నారు. అయితే ఒంగోలు పీఐయూ విభాగంలో మరొక ఈఈ ఉన్నా ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టలేదు. దీంతో గుంటూరు ఎస్ఈ అశోక్ ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యవేక్షణ చేయాల్సి రాగా జిల్లాకు చుట్టపుచూపుగా కూడా వస్తున్న పరిస్థితి లేదు. ఈ విభాగం పరిధిలో దాదాపు రూ.120 కోట్ల మేర తాజాగా ఉపాధి పథకం అనుసంధానం పనులు మంజూరు కాగా వాటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.



ఎస్ఈ కార్యాలయం

ఒకే అధికారి రెండు పోస్టులకు ఇన్‌చార్జి

ఆ రకంగా ఆ నాలుగు శాఖలు అత్యంత కీలకం కాగా ప్రస్తుతం వాటి జిల్లా స్థాయి అధికారులు ఇన్‌చార్జిలుగా ఉంటూ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీటిలో జడ్పీ సీఈవో, డీపీవో పోస్టులు ఆరు మాసాలకుపైగా ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. జడ్పీ సీఈవో ఇక్కడ పనిచేస్తున్న జాలిరెడ్డి, డీపీవోగా ఉన్న నారాయణరెడ్డిలు సొంత జిల్లా వారు కావడమే కాక దీర్ఘకాలంగా ఇక్కడే పనిచేసిన నేపథ్యంలో సాధారణ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీ జరిగింది. మార్చిలో అలా జరగ్గా అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. జడ్పీ సీఈవోగా కలెక్టర్ కార్యాలయంలో విపత్తుల నిర్వహణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మాధురి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె అప్పటికే స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీగా పూర్తి అదనపు బాధ్యతల్లో ఉండటంతో ఏకంగా మూడు బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. అలాగే ఒంగోలు డివిజన్ అభివృద్ధి అధికారిగా ఉన్న ఉషారాణిని ఇన్‌చార్జి డీపీవోగా నియమించారు. ఆమె ఈ రెండింటితోపాటు గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారిగా ఉండి అలా మూడు పోస్టుల్లో పనిచేస్తున్నారు. ఆలా మూడేసి బాధ్యతల్లో ఉన్నవారు పనిభారంతో దేనికి సరిగా న్యాయం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

అవగాహన లేని ఉన్నతాధికారులు

ఇక జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం కూడా ప్రధానమైంది. వందల కోట్ల రూపాయల విలువైన జలజీవన్ మిషన్ పనులు, అలాగే గ్రామ స్థాయి రక్షిత తాగునీటి పథకాలు, ట్యాంకర్లతో నీటి సరఫరా, సాగర్ నీటితో ఎస్‌ఎస్ ట్యాంకులు, చెరువులు నింపడం వంటి కీలకమైన పనుల పర్యవేక్షణ ఆ శాఖ ఎస్ఈ పరిధిలో ఉంటాయి. ఆ పోస్టులో ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసిన మర్దన్‌అలీ ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో జిల్లాలోని అధికారులకు కాకుండా గుంటూరు జిల్లా ఎస్ఈ సురేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన గుంటూరు ఎస్ఈతో పాటు అప్పటికే నెల్లూరు ఎస్ఈగా కూడా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముచ్చటగా మూడవ జిల్లా ఎస్ఈగా ప్రకాశం బాధ్యతలను కూడా అప్పగించారు. ఒంగోలు ఎస్‌గా ఒక్క పోస్టులో ఉంటేనే తీరిక లేని పనివత్తిడి ఉంటే ఈ పోస్టులో ఏకంగా మూడు జిల్లాల పర్యవేక్షణ ఏలా సాధ్యమన్నది ఉన్నతాధికారులకే తెలియాలి. జిల్లాపై అవగాహన లేకుండా ఉన్నతాధికారులు, సమన్వయం, పర్యవేక్షణ లేనివిధంగా కీలక ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుంటడంతో పంచాయతీరాజ్ విభాగంలో ఈ పరిస్థితి ఏర్పడింది. తక్షణం రెగ్యులర్ అధికారుల నియామకాలు చేపట్టకపోతే ఇప్పటికే అంతంతమాత్రంగా కనిపిస్తున్న పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షణ మరింత దిగజారే పరిస్థితి కనిపిస్తోంది.

శానిటేషన్‌పై కదిలిన యంత్రాంగం

గవినివారిపాలెంలో పారిశుధ్య పనులు

వాస్తవ అవాస్తవాలపై ఎంపీడీవో విచారణ



ఆంధ్రజ్యోతి కథనంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబర్ 18 : ఎట్టకేలకు చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంలో శానిటేషన్‌పై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన గవినివారిపాలెంలో పారిశుధ్యం అధ్వాన్నం కథనంపై స్పందించారు. ఉదయం నుంచే కార్యదర్శి నీలిమ కార్మికుల సహకారంతో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. మురుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమెపై వచ్చిన ఆరోపణలపై ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఇందులో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఏవో శ్రీనివాసరావు, సెక్రటరీ నీలిమ ఉన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- నేతాజీ, ఎపీఈడీవో, చీరాల మండలం

అన్ని గ్రామాలపై శానిటేషన్ పరంగా ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గవినివారిపాలెం సెక్రటరీపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నాం.

వరద ప్రాంతాలకు పశుగ్రాసం తరలింపు



పశుగ్రాసం తరలిస్తున్న చీరాల న్యాయవాదుల సంఘం

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : వరద ప్రభావంతో మూగ జీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడడం బాధాకరమని చీరాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు అన్నారు. ఈక్రమంలో బుధవారం రూ.25వేలు విలువైన ట్రాక్టర్ పశుగ్రాసాన్ని ముంపు ప్రాంతమైన కొల్లూరు మండలం తోకావారిపాలెం రైతులకు పంపించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా వరద ప్రభావం సంభవించిన తీరుపై బాధను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గౌరవ రమేష్‌బాబు, సాయిబాబు, ఆదినారాయణ, చలపతిరావు, గంగరాజు, హరిబాబు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారెడ్డి, కోటేశ్వరమ్మ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

సంతమాగులూరు, సెప్టెంబరు 18 : భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులకు సహాయంగా రూ.లక్ష చెక్కును విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం అందించారు. మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన చింతా శ్రీకాంత్ పోలాండ్ దేశంలో వ్యాపార నిమిత్తం ఉంటున్నారు. వరద బాధితులకు తన వంతు సహాయంగా అందించాలని రూ.లక్ష చెక్కును తన సోదరుడు, సొసైటీ మాజీ అధ్యక్షులు చింత శ్రీధర్‌బాబు ద్వారా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా రామారావు, చింతా వెంకయ్య ఉన్నారు.

బస్సును ఢీకొన్న ట్రాక్టర్



ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న ట్రాక్టర్

మేదరమెట్ల, సెప్టెంబరు 18 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం-మేదరమెట్ల మధ్య ఆగి ఉన్న బస్సును ట్రాక్టర్ ఢీకొట్టింది. బుధవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు సెన్సార్ సమస్యతో రోడ్డు పక్కన ఆగింది. అదే మార్గంలో సిమెంట్ ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్ కారును తప్పించబోయి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూశారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

చీరాలటౌన్, సెప్టెంబర్ 18 : గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందారు. ఈ ఘటన స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. వృద్ధుడు బట్టతలతో, తెలుపురంగు నిండు చేతుల లాల్చీ, ఆకుపచ్చ చిన్న గడుల లుంగీని ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వ్యక్తిది వెదుళ్లపల్లి సమీపంలోని కొత్తపాలెం లేదా బేతపూడికి చెందిన వాసిగా అనుమానిస్తున్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు అనుసరించాలి



విత్తన శుద్ధి చేస్తున్న సిబ్బంది

మేదరమెట్ల, సెప్టెంబరు 18 : రైతులు పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రావినూతల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మినుము సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన శుద్ధితో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వీఏవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

రోగులతో కిక్కిరిస్తున్న ఆసుపత్రులు.. ఆందోళనలో ప్రజలు

పర్చూరు, సెప్టెంబరు 18 : గ్రామాల్లో జ్వరాలు వణికిస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరుస్తున్నాయి. గ్రామాల్లో ఇంటికి ఇద్దరు చొప్పున రోగులు మంచంపట్టారు. రోజుల తరబడి జ్వరం, ఒంటి నొప్పిలతో ప్రజలు బాధపడుతున్నారు. డెంగ్యూ, గున్యా, మలేరియా కేసులు నమోదవుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరబాధితులు బారులు తీరుతున్నారు. పారిశుధ్య లోపం, పరిశుభ్రమైన నీరు లేకపోవడంవల్లే రోగాలు ప్రబలుతున్నాయని వైద్యులు చెప్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నమోదవుతున్న జ్వరపీడితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జ్వరపీడితులతో కిక్కిరిస్తున్న పర్చూరు ప్రభుత్వ వైద్యశాల

సక్రమంగా మధ్యాహ్న భోజనం అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అమలులో ఆహారపట్టికను పక్కాగా పాటించాలన్నారు. ఆ విషయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో పెడుతున్న భోజనం ఇష్టంగానే తింటున్నారా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు భోజనాన్ని తరుచూ పరిశీలిస్తుండాలని ఆదేశించారు. పాఠశాలల్లో రక్షిత మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా టీచర్లు, కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులు మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు పులిహోర పెడుతున్నారని, దానిని ఒక రోజుకు కుదించాలని కోరారు. కోడిగుడ్లను ఉడికించి ఐదు రోజులు ఇస్తున్నారని, రెండు, మూడు రోజులు కోడిగుడ్డు కర్రీ రూపంలో ఇస్తే బాగుంటుందని తెలిపారు. అన్నం, సాంబరు విడిగా ఉంటే బాగుంటుందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మెనూ చార్జీలు పెంచాలని, ప్రస్తుతం ఇస్తున్నవి సరిపోవడం లేదని ఏజెన్సీలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ ఆహర పట్టికలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి నివేదికను పంపుతామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా బోధనతో పాటు పాఠశాల నిర్వహణ, శానిటేషన్, నీటి సదుపాయం, హ్యాండ్‌వాష్ ప్రక్రియ తదితర అంశాలపై కూడా దృష్టిసారించాలన్నారు. సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో సుబ్బారావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన

2,300 మందికి పైగా యువత హాజరు

585 మందికి ఉద్యోగావకాశాలు

పాల్గొన్న 42 కంపెనీలు



ఇంటర్వ్యూలకు ఎంపికైన వారితో లక్ష్మి, సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 18 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ తమ సొంత నిధులతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం 2300 మంది యువతీ యువకులు మేళాలో పాల్గొన్నారు. టెక్ మహేంద్ర, అమర్‌రాజా బ్యాటరీస్ తదితర కంపెనీలతో పాటు మొత్తం 42 సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. దర్శి, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిరుద్యోగులు వచ్చారు. కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 585 మందిని ఎంపిక చేశారు. మరో 200 మందిని పరిశీలనలో ఉంచారు. వారికి కూడా త్వరలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఎంపిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సన్మార్గంలో ముందుకు సాగి దేశాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అందుకు యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. జాబ్ మేళాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. హెచ్‌ఆర్‌సీ సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి సర్వే చేపట్టి నిరుద్యోగ యువత వివరాలను తెలుసుకుంటామని, అవసరమైన వారికి శిక్షణ అందించి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు.

బ్లాక్ పెరల్ గ్రానైట్ అసోసియేషన్ రూ.50.50లక్షల విరాళం



మంత్రికి విరాళం చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

సంతమాగులూరు, సెప్టెంబరు 18 : వరద బాధితులను ఆదుకునేందుకు బ్లాక్ పెరల్ గ్రానైట్ క్వారీ అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చారు. పల్నాడు, బాపట్లకు చెందిన ఆయా సంస్థల ప్రతినిధులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను రాష్ట్ర సచివాలయం వెలగపూడిలో కలిసి రూ.50,50,000 చెక్కును అందజేశారు. విరాళాలు అందించిన వారిలో మను గ్రానైట్స్ రూ.5లక్షలు, ఏ.నరసింహారావు క్వారీ రూ.5లక్షలు, వీరాంజనేయ క్వారీ రూ.5లక్షలు, కామేపల్లి ఎక్స్‌పోర్ట్స్ రూ.5లక్షలు, గగన్ మినరల్స్ రూ.2.5లక్షలు, సౌదామిని గ్రానైట్స్ రూ.5లక్షలు, ఇంపీరియల్ గ్రానైట్స్ రూ.4లక్షలు, గౌతమ్ గ్రానైట్ రూ.2లక్షలు, మధుకాన్ గ్రానైట్స్ రూ.1లక్ష, శ్రీవిష్ణు గ్రానైట్స్ రూ.లక్ష, వీరభద్ర మినరల్స్ ప్రై.లి రూ.5లక్షలు, మన్నేపల్లి వెంకటరావు రూ.లక్ష, వీర హనుమాన్ గ్రానైట్స్ రూ.2లక్షలు, వీరహనుమాన్ మినరల్స్ రూ.2 లక్షలు, స్వస్తిక్ ఎక్స్‌పోర్ట్స్ రూ.2లక్షలు, కేబీ రాక్స్ రూ.3 లక్షలు, వీరితో పాటు మరికొందరు దాతలు కూడా సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కులను అందించారు. చింతా శ్రీకాంత్ రూ.లక్ష, కుర్రవానిపాలెంలో నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు సేకరించిన రూ.లక్ష, అనంతలక్ష్మి రూ.87 వేలు, మల్లిపెద్ది హనుమంతరావు రూ.10,116, కొట్టె రవీంద్ర రూ.లక్ష, జే పంగలూరు వెలుగు సభ్యులు రూ.1,01,116, అద్దంకి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూ.20,116, కర్రి సత్యనారాయణ ఇంకొల్లు రూ.50వేలు, రాధ మాధవి రామకూరు రూ.1,70,000 విరాళాలను కలిపి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు.

ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్

ఉత్తర్వులను ఎట్టకేలకు బయటపెట్టిన పంచాయతీ అధికారి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: జిల్లాలోని రెండు గ్రామపంచాయతీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ముగ్గురు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవంగా ఆ ముగ్గురు కార్యదర్శులను బుధవారమే సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకుండా దాచిపెట్టిన విషయంపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్ చేసిన ఉత్తర్వులను ఆయా మండలాల ఎంపీడీవోలకు పంపారు. సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య రూ.79వేలను ఫోన్‌పే ద్వారా తన బ్యాంకు ఖాతాకు జమచేయించుకొని రికార్డులు చూపలేదు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను గ్రామపంచాయతీ రికార్డు దాఖలు లేకుండా జారీచేయడంతో రామకోటయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి పి.శ్రీనివాసులు, పెదకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-5) ఎస్.వినోద్‌లను సస్పెండ్ చేశారు. దొడ్డవరప్పాడు పంచాయతీలో ముందస్తు నోటీసులు లేకుండా వార్డుసభ్యుల ఆమోదం లేకుండా ఈ ఏడాది జనవరి 12, ఈ ఏడాది ఫిబ్రవరి 23న మీటింగ్ నిర్వహించినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ తీర్మానం చేశారు.

సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి నిబంధనలకు విరుద్ధంగా రూ.7,36,400 తన సొంత ఖాతాకు నిధులు బదిలీ చేసుకున్నట్లు ఉప సర్పంచ్ మురళీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేసి ఆ నిధులకు సంబంధించి నివేదిక ఇచ్చారు. పంచాయతీ నిధులకు ఆమోదం లేకుండా నిధులు డ్రా చేసేందుకు సహకరించిన గ్రామపంచాయతీ కార్యదర్శి, డ్రాయింగ్ అధికారి పి.శ్రీనివాసులు, గ్రేడ్-5 కార్యదర్శి వినోద్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పీవీఆర్ స్కూలు పీడీ సస్పెన్షన్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 18: ఒంగోలు పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్(పీడీ)గా పనిచేస్తున్న జ్యోత్స్నాదేవి సస్పెండయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ డీఈవో సుభద్ర బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లను పీడీ సూటిపోటి మాటలతో వేధిస్తూ శిక్షిస్తుందని ఆ బాలికల తల్లి రావిపాటి లక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈనెల 9న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు విచారణ చేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించిన లోకేశ్వరరావు సాక్ష్యాధారాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దానిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన పీడీ జ్యోత్స్నాదేవిని సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించారు. దీంతో పీడీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను బుధవారం పాఠశాల హెచ్ఎంకు పంపారు.

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళనలు



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. వారం నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు బుధవారం విజయవాడలో జరిగిన ధర్నాకు తరలివెళ్లారు. పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను 15శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ఈ ఆందోళనలు చేస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ పీజీ విద్యలో ఇన్‌సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జీవో నెంబరు 85 జారీచేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ జీవోను రద్దుచేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

ఎండుతున్న ఖరీఫ్ పంటలు

- మళ్లీ మండుతున్న ఎండలు
- గత ఏడాది కంటే తగ్గిన పంటల సాగు
- గత ఖరీఫ్‌లో 4,329 హెక్టార్లు ఈసారి 2,350 హెక్టార్లలో సాగు
- ఆందోళనలో అన్నదాతలు

బల్లికురవ, సెప్టెంబరు 18 : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బెట్ట దెబ్బ తగిలింది. గత పదిరోజుల కిందట వరకు రోజు ముసురు పట్టి చిరు జల్లులు పడడంతో పంటలు కొంత ఊపిరి పోసుకున్నాయి. మరలా ఇప్పుడు గత నాలుగు రోజుల నుంచి ఎండలు పెరగడంతో పంటలు విలవిలలాడుతున్నాయి. రోజు రోజుకూ వేసిన పంటలు వడ పడి పోతున్నాయి. కొన్ని గ్రామాలలో అయితే రైతులు పంటలపై ఆశలు వదిలేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షపాతం కూడా తక్కువగానే ఉందని అందువలనే సగానికి సగం పంట విస్తీర్ణం తగ్గిందని రైతులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ఈ మాసాంతానికి ముగుస్తున్న పంటలు సాగు మాత్రం ముందుకు సాగటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకేమారు వర్షాలు పడకపోవడం వలనే ఈ ఏడాది పంటలు సాగు అలస్యం అవుతుందని మరలా వర్షాలు పడితేనే పంటలు సాగుకు రైతులు ముందుకు వస్తారని పలువురు అంటున్నారు.


కొణిదెనలో ఎండలతో ఎండుతున్న మిర్చి మొక్కలు

బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో రైతులు ఖరీఫ్ సీజన్ కింద పత్తి, మిర్చి, పొగాకు, జూటు, కూరగాయలు, వరి పంటలను సాగు చేశారు. గతంలో మాదిరిగా కాకుండా దఫదఫాలుగా కురిసిన వర్షాలతో పంటలను కొందరు రైతులు సాగు చేశారు.


నక్కబొక్కలపాడులో వడ పడుతున్న సొర తోట

గతంలో ఏడాది ఖరీఫ్‌లో రైతులు 4329 హెక్టార్ల పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రైతులు వర్షాలు లేకపోవటంతో 2350 హెక్టార్లలోనే పంటలను సాగు చేశారు. గత పది రోజుల వరకు పలు ప్రాంతాలలో వర్షాలు బాగా పడడంతో వాగులు వంకలు పొంగాయి. బల్లికురవ మండలంలో మాత్రం వర్షపాతం పంటలకు సరిగా సరిపోలేదని రైతులు అంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి మరలా పెరిగిన ఎండలతో సాగు చేసిన పంటలు అన్ని వాడుముఖం పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న పంటల సాగు మాత్రం పూర్తి కాలేదని సాగర్ నీరు రావడం వలనే కొంత పంటలను కాపాడుకో గలుగుతున్నామని రైతులు తెలిపారు. ఏబీసీ కాలువ కింద రైతులు వరి పంటను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. బోరు బావుల కింద కూడా పంటలు సాగు ముందుకు సాగడం లేదని వర్షాలు తగ్గటం వనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. కొణిదెన, నక్కబొక్కలపాడు, కొప్పెరపాలెం, గంగపాలెం, రాజుపాలెం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కోటవారిపాలెం, వేమవరం, గుంటుపల్లి, కొత్తపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, కొత్తూరు, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలు బెట్టకు వచ్చాయి అని రైతులు తెలిపారు. వర్షాలు లేకుంటే ఖాళీగా భూములు ఉండే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. కొందరు రైతులు సాగర్ నీటిని మెట్ట పంటలకు నీటి తడులు కట్టే పనులలో ఉన్నారు. బెట్టకు వచ్చిన పంటలకు రైతులు యింజన్ల ద్వారా నీటిని పెట్టి పంటను కాపాడుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు.

లక్ష తమలపాకుల పూజ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, సెప్టెంబరు 18 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష తమలపాకుల పూజ జరిగింది. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించి అనంతరం స్వా మి వారికి అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. మహా నివేదన, పంచహారతులు నిర్వహించారు. తక్ష తమలపాకుల పూజ అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వర్షపు జల్లులతో ఉపశమనం

అద్దంకి, సెప్టెంబరు 18 : కొద్దిరోజులుగా ఎండ వేడిమి ఎక్కువగా ఉండగా బుధవారం సాయంత్రం కురిసిన వర్షపు జల్లులతో ఉపశమనం కలగింది. బుధవారం సాయంత్రం 6-30 గంటల సమయంలో సుమారు అర గంట పాటు వర్షం పడింది. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మరోపక్క ఎండ వేడిమికి సాగు చేసిన పంటలు కూడా బెకబెకలాడుతున్నాయి. వర్షపు జల్లులు కొంతమేర ఉపశమనం కలిగించింది.


ఉప్పుమాగులూరులో పత్తిని పరిశీలిస్తున్న ఏడీఏ

పత్తి పంటలో సస్యరక్షణ చేపట్టాలని

బల్లికురవ, సెప్టెంబరు 18 : వాతావరణంలో వచ్చిన మార్పులతో పత్తి పంట బెట్టకు వచ్చి పలు తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మార్టూరు సబ్ డీవిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు పత్తిలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగు పేనుబంక అధికంగా ఉందని రైతులు తక్షణమే వాటి నివారణకు అసిటామీప్రిడ్ 40 గ్రాములు, లేదా థయోమిథోగ్జామ్ 40 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 80 మిల్లీ గ్రాముల ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పంట బెట్ట నివారణకు మల్టీ కే ఎకరానికి 2కిలోల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. అలానే గులాబీ పురుగు నివారణకు రైతులు పంటలో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలు వాడాలని తెలిపారు. ఈ పరిశీలనలో బల్లికురవ వ్యవసాయధికారి కుమారి, వీఏఏలు హరికృష్ణ, హనుమనాయక్, రైతులు ఉన్నారు.

బ్లడ్ గ్రూపు పరీక్షలు తప్పని సరి

స్వర్ణ(పర్చూరు), సెప్టెంబరు 18 : ఎన్‌సీసీలో ప్రవేశం పొందే విద్యార్థులు తప్పనిసరిగా బ్లడ్ గ్రూపు పరీక్షలు చేయించుకోవాలని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రసాద్ అన్నారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఎన్‌సీసీలో ప్రవేశం పొందే 8, 9 విద్యార్థులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ బయ్య శంకర్ పరీక్షలు చేసి, గ్రూపులను తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న డీఎం, అసిస్టెంట్ డీఎం

అద్దంకి, సెప్టెంబరు 18 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల సందర్భంగా రెండవ రోజు గ్యారేజీ ఆవరణలో 25 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం మహబూబి, సిబ్బంది పాల్గొన్నారు.

అడుసుమల్లి(పర్చూరు) : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండలంలోని అడుసుమల్లి గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని వార్డులలో పారిశుధ్య కార్మికులతో కలసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం విద్యార్థులో ర్యాలీ నిర్వహించారు.

ఓజోన్ రక్షణ అందరి బాధ్యత

జాండ్రపేట(చీరాలటౌన్), సెప్టెంబరు 18 : ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి పేర్కొన్నారు. చీరాల మండల పరిధిలోని జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పర్యావరణంపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జీవ వరణానికి రక్షణ కవచమైన ఓజోన్ పొర మానవ స్వయం కృతాపరాధం వలన నాశనమవుతోందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో జేవీ నాగలక్ష్మి, శవనం చంద్రారెడ్డి, శాస్త్రవేత్త చెంగలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షఫి మాస్టర్‌కు సన్మానం


షఫిని సన్మానిస్తున్న ఎంఈవోలు

పర్చూరు, సెప్టెంబరు 18 : విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వ్యక్తి ఎస్ఎండీ షఫి మాస్టర్ అని విద్యాశాఖాధికారి పి.వెంకట్రామయ్య అన్నారు. పర్చూరు ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న షఫి మాస్టార్‌ను బుధవారం స్కూల్ కాంప్లెక్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో 1 సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

ఇంకొల్లు, సెప్టెంబరు 18 : ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామానికి చెందిన చప్పిడి బుల్లి పున్నయ్యపై పోక్సో కేసును నమోదు చేశారు. చిన్నారులతోపాటు మగ పిల్లలపై కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన 14 ఏళ్ల వయస్సు గల బాలుడిని పొలాలవైపు తీసుకెళ్లాడు. భయపడిన ఆ బాలుడు పరుగులు తీసి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో ఆతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుకదర్శిలో చోరీ

మార్టూరు, సెప్టెంబరు 18 : ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గుర్తించి చోరీకి పాల్పడ్డాడు ఓ యువకుడు. ఇంట్లో ఉన్న బీరువాను ఎత్తుకుపోయాడు. రూ.25వేల నగదు, కొంత వెండి వస్తువులు, బంగారపు రెండు చెవిచుట్లు, బట్టలు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే దొంగ మాత్రం రెండు బంగారపు చెవిచుట్లను మాత్రమే దొంగిలించాడు. మిగిలిన వస్తువులు ఆతనికి కనిపించక, బీరువాను గ్రామ సమీపంలోని నీటి మడుగులో పడేశాడు. 10 రోజుల కిందట మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో ఈ దొంగతనం జరిగింది. బాధితుడు నాగయ్య ఇంటి వెనుక ఇంట్లో ఉంటున్న యువకుడే ఈ దొంగతనం చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు దొంగతనం చేసిన యువకుడు ఇచ్చిన సమాచారం మేరకు బీరువాను వెలికితీశారు. బీరువాను తెరిచి చూడగా బంగారపు చెవిచుట్లు మినహా, రూ.25వేల నగదు, వెండివస్తువులు, విలువైన వస్త్రాలు ఉన్నాయి. పాస్‌పుస్తకాలు, డాక్యుమెంట్లు తడిసిపోయాయి. ఈ చోరీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

40 మద్యం బాటిళ్ల పట్టివేత

చినగంజాం, సెప్టెంబరు 18 : అక్రమంగా మద్యం బాటిల్స్ తీసుకొని వెళ్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. చింతగుంపల్లి గ్రామానికి చెందిన చేగుడి విజయ్‌కుమార్ బుధవారం రాత్రి అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకొని వెళ్తుండగా సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మున్నంవారిపాలెం రైల్వేగేటు దగ్గర ఏర్పాటు చేసిన మద్యం షాపు సమీపంలో విజయ్‌కుమార్‌ని అదుపులోనికి తీసుకొని 40 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

30ఏళ్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం

- ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్
- టెక్నికల్ శాంక్షన్ కోసం ఎస్టిమేషన్స్ పంపిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు
- మున్సిపాలిటీ వాటా రూ.4.13 కోట్లు చెల్లింపు
- రూ.23.80 కోట్ల నిధులు మంజూరుకు మార్గంసుగమం

చీరాల, సెప్టెంబరు 18 : చీరాల పట్టణ పరిధిలో రానున్న 30ఏళ్లలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. అందుకోసం మున్సిపల్ వాటాగా రూ.4.13 కోట్ల నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించారు. దీంతో భవిష్యత్ ప్రణాళిక ఆచరణకు రూ.23.80 కోట్లు నిధులు మంజూరుకు మార్గం సుగమం అయింది.

చీరాల మున్సిపల్ పరిధిలో 23,500 గృహాలు ఉన్నాయి. సుమారు లక్ష జనాభా. ప్రస్తుతం చీరాల, కారంచేడు రోడ్డులోని ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నీటిని శుద్ధి చేసి పురప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ట్యాంక్ కెపాసిటీ 10 ఎంఎల్‌టీ (మిలియన్ లీటర్లు). మున్సిపల్ పరిధిలో ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు (రిజర్వాయర్లు) ఉన్నాయి. వీటి ద్వారా ఒక్కో మనిషికి రోజుకు 80 లీటర్ల చొప్పున తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వచ్చే 30 ఏళ్ల కాల వ్యవధిని పరిగణలోకి తీసుకుని భవిష్యత్‌లో తలకు రోజుకు 135 లీటర్లు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అందుకు మరో 8ఎంఎల్‌టీల నీటినిల్వ అవసరం ఉంటుంది. వీటికి అనుగుణంగా కార్యాచరణకు ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేషన్స్‌ను తయారు చేసి టెక్నికల్ శాంక్షన్‌కు పంపారు.


చీరాల ఎస్ఎస్ ట్యాంకులో 19 అడుగుల మేర ఉన్న నీరు

టెక్నికల్ శాంక్షన్ వచ్చిన తరువాత పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం నూతన ప్రాజెక్టుకు సంబంధించి మున్సిపల్ వాటా ధనం రెండు పద్దులకు గాను రూ.4.13 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించడం జరిగింది. ప్రాజెక్టుకు సంబంధించి ఎస్టిమేషన్స్‌ను పంపించాం. టెక్నికల్ శాంక్షన్ రావల్సి ఉంది. అది వచ్చిన తరువాత త దుపరి పనులు చేపడతాం.

- ఏసయ్య, డీఈ, చీరాల మున్సిపాలిటీ

చెల్లించిన మున్సిపల్ వాటా ధనం

ఈ ప్రాజెక్టుకు సంబంధించి మున్సిపల్ వాటా ధనాన్ని ముందస్తుగా చెల్లించాల్సి ఉంది. అందుకు సంబంధించ గత కౌన్సిల్ సమావేశంలో పొందు పరిచిన అంశంపై కౌన్సిల్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. చివరిగా మున్సిపల్ వాటా ధనం చెల్లించే విధంగా ఆమోదించారు. అందుకుగాను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.33 కోట్లు, రూ.1.80 కోట్లు రెండు పద్దులకు గాను మొత్తం రూ.4.13 కోట్లు చెల్లించారు. ఈ క్రమంలో మొత్తం ప్రాజెక్టుకు గాను రూ.23.80 కోట్లు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ పడింది.

ఇంటింటికీ ట్యాపులు

మున్సిపల్ పరిధిలో మొత్తం 23,500 ఇళ్లు ఉంటాయి. అందులో ప్రస్తుతం 10వేల ఇళ్లకు మాత్రమే మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. వ్యాపార సముదాయాలను మినహాయించినా మరో 12వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకుగాను సుమారు 15కిలోమీటర్లు మేర పైపులైన్లు వేయాల్సి ఉంటుంది. ఇదిలావుంటే కారంచేడులో కొమ్మమూరు కాలువ వద్ద నున్న పంప్‌హౌస్ నుంచి చీరాల ఎస్ఎస్ (సమ్మర్ స్టోరేజీ) ట్యాంక్ వరకు ఏడు కిలోమీటర్ల దూరం ఉంది. అందులో 6కిలోమీటర్లు మేర రెండున్నర అడుగుల ఒరలతో ఏర్పాటు చేసిన కాలువ నుంచి నీరు వస్తుంది. అదే పద్ధతిలో మరో కిలోమీటరు మేర ఒరలు వేయాల్సి ఉంది. ట్యాంక్ వద్ద మరో ఫిల్టర్ బెడ్ నిర్మించాలి. పట్టణంలో రామ్‌నగర్ ప్రాంతానికి తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి పేరాల హైస్కూల్ ప్రాంగణంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీరు వెళుతుంది. ట్యాంక్‌కు రామ్‌నగర్‌కు సుమారు 3 కి.మీ దూరం ఉండడంతో పైపుల్లో పారుదల తక్కువగా ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో మరో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తారు. ఇవన్నీ నూతన ప్రాజెక్టులో రూపుదిద్దుకుంటాయి.


కారంచేడు గేటు సెంటర్లో ఓవర్‌హెడ్ ట్యాంక్


గోశాలకు వరిగడ్డిని అందజేస్తున్న రోటరీ సభ్యులు

గోశాలకు పశు గ్రాసం అందజేత

అద్దంకిటౌన్, సెప్టెంబరు 18 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గోశాలకు పశు గ్రాసాన్ని అందజేశారు. బుధవారం అద్దంకి పట్టణంలోని హరిహర గోశాలకు రోటరీ మిత్రుల సౌజన్యంతో రూ20వేలతో పశుగ్రాసం (వరిగడ్డి)ని అందజేశారు. పశువుల పెంపకం అనేది జీవన విధానంలో భాగమని, ప్రత్యేకంగా ఆవుకి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఆవుల సంపదని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గాడేపల్లి దివాకర్‌దత్తు అన్నా రు. రోటరీ మిత్రుల సహకారంతో ట్రాక్టర్ వరిగడ్డిని గోశాలకు అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షు డు సందిరెడ్డి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, గుళ్లపల్లి సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హాజరు బాధ్యత ఉపాధ్యాయులదే

అద్దంకిటౌన్, సెప్టెంబరు 18 : రిజిస్టర్‌లోని విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈవోలు డి.గంగాధరరావు, బి. సుధాకరరావు తెలిపారు. బుధవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతు అన్ని పాఠశాలలో 10 గంటలలోపు విద్యార్థుల హాజరు తప్పక తమోదు చేయాలని, అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు వివరాలు తెలిపే విధంగా ప్రొఫైల్‌ను చూపించాలన్నారు. గత సంవత్సరం చదివిన ఏ విద్యార్థి కూడా డ్రాపౌట్‌గా మిగలకూడదని, తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించి, వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులందరూ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లోని టీచర్ రి సోర్స్ బుక్‌ను ఉపయోగించుకుని విద్యార్థుల ప్రమాణాలను పెంచాలన్నారు. మధ్యాహ్నం భోజన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ శ్యామల, రిసోర్స్ పర్సన్‌లు ధనలక్ష్మి, పుణ్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

పంగులూరు, సెప్టెంబరు 18 : ఖరీఫ్ పంట సాగు వివరాలు ఈ నెల 23వ తేదీ లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సాగులో ఉన్న పంటల ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఏవో పరిశీలించారు. ప్రభుత్వ రాయితీలు రైతుకు అందాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరుకు ఖరీఫ్ పంటసాగు నమోదు వివరాలు రైతు సేవా కేంద్రాలలో డిస్‌ప్లే చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : పంట నమోదుకు ఈ నెల 23వ తేదీతో గడువు ముగుస్తుందని వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నాగరాజుపల్లి, ద్రోణాదుల గ్రామాలలో పంట నమోదును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 4700 ఎకరాలను సాగుచేయగా, వాటిలో 4610 ఎకరాల పంట నమోదు పూర్తయ్యిందన్నారు. మిగిలినవారు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు.


23 నుంచి 25 వరకు ఆటల పోటీలు

మార్టూరు, సెప్టెంబరు 18 : పర్చూరు నియోజకవర్గంలోని 6 మండలాల జడ్పీ హైస్కూల్లో ఈ నెల 23 నుంచి 25 వతేదీ వరకు మండల స్థాయిలో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త పీ.కోటేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరగనున్న ఈ ఆటల పోటీలలో అండర్14, అండర్ 17 బాల బాలికలకు ఆటలపోటీలు జరుగుతాయన్నారు. వాటిలో పాల్గొనే విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం ఈ పోటీలలో విజేతలైన బాల బాలికలకు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ఇంకొల్లు జడ్పీ హైస్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. అందువలన ఆయా మండలాల్లో క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు సంబంధించిన స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సమాచారాన్ని అందించాలని కోటేశ్వరరావు కోరారు.

వైపఏ కళాశాలకు పతకాలు

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : రాష్ట్ర స్థాయి రెడ్ రన్ (మారథాన్) 5కేఎం పోటీలలో చీరాల వైపఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థిని వి.చెన్ననీలకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, రమ్యజాయ్‌కు తృతీయ స్థానంలో నిలిచి నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఏపీ వైద్యారోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యువతలో మార్పు కోసం విజయవాడలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సిబ్బందితో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విద్యార్థినులను అభినందించారు.


చెక్కును అందుకుంటున్న చెన్ననీల, రమ్యజాయ్


బాలామృతం పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి ఉమ

అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా అధికారి ఉమ

చీరాలటౌన్, సెప్టెంబరు 18 : గర్భిణులు, బాలింతలు ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఉమ అన్నారు. బుధవారం పురపాలక పరిధిలోని సెక్టార్‌సీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం సీమంతం, అన్నప్రాసన నిర్వహించారు. బాలామృతం పంపిణీ చేశారు. ఏసీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్ కుముద్వతి, హెచ్‌వి వసంతవల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 18 : వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. బుధవారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాల సముదాయ సమావేశాలను ఆయన పరిశీలించారు. స్కూళ్లలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ వద్దని, మిగులు ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశామన్నారు. విద్యార్థుల హాజరు, పరీక్షపత్రాల తయారీపై దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో రీసోర్స్ పర్సన్స్ పి.రవికుమార్, మార్క్, వీరాంజనేయులు, శారద, సీఆర్‌పి మస్తానవలి పాల్గొన్నారు.


డిపో ముఖద్వారం వద్ద అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలు

ఆర్టీసీ డిపోలోకి వెళ్లాలంటే తిప్పలే

చీరాల, సెప్టెంబరు 18 : ఆర్టీసీ డిపో ప్రధాన ముఖ ద్వారం నుంచి లోపలకు వెళ్లాలంటే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. డిపో ముఖ ద్వారం వద్ద ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడం అందుకు కారణం. ప్రధాన ద్వారానికి ఒక వైపు ఉన్న టీ దుకాణానికి వచ్చేవారు వారి వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఉంచుతున్నారు. కొందరు అక్కడే వాహనాలను నిలిపి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ క్రమంలో బస్సు డిపోలోకి వెళ్లాలంటే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. డిపోలోకి వెళ్లాలంటే పద్మవ్యూహాన్ని ఛేదించినట్లు ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో అక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా ఉంటాయి. మధ్య ముఖద్వారం ఎదురుగా ఆటో డ్రైవర్లు ఆటోలను నిలుపుతున్నారు. ఈ కారణంగా డిపోలోకి వెళ్లాలంటే ఎవరైనా ఇబ్బంది పడాల్సిందే. నిత్యం జరిగే ఈ తంతు డిపో అధికారులకు కనిపించడం లేదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే డిపో మేనేజర్ తగిన చర్యలు తీసుకుని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

రైతు మృతిపై కేసు

బల్లికురవ, సెప్టెంబరు 18 : మండలంలోని గుంటుపల్లికి చెందిన రైతు చల్లగుండ్ల నాగేశ్వరరావు (58) పాము కాటుతో మృతి చెందిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.